


ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 39.0
కనిష్ఠం : 24.0

కరెంట్ కష్టం

ఈదురు గాలులతో కూలిన చెట్లు, విరిగిపడిన విద్యుత్ స్తంభాలు

● అంధకారంలో గ్రామాలు.. ● మరో మూడు రోజులు ఇబ్బందులే..



గుడివాడ రూరల్ మండలం మోటూరు వద్ద కుప్పగూలిన విద్యుత్ టవర్



విరిగిన స్తంభాల తొలగింపు పనులు

కైకలూరు / ముదినేపల్లి / కలిదిండి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఈదురు గాలుల ఇక్కట్లు వెంటాడుతూనే ఉన్నాయి. ఎక్కడికక్కడ విద్యుత్ స్తంభాలు విరిగిపడడంతో సోమవారం రాత్రి కైకలూరు మండలంలోని అనేక గ్రామాలు అంధకారంలో ఉన్నాయి. రాత్రి 9 గంటల సమయంలో ఏలూరు నుంచి కైకలూరు ప్రధాన లైన్‌లో జంపర్లు తెగి విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రాత్రి ఒంటి గంట సమయంలో కైకలూరుకు, 3 గంటల తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో గృహాలకు విద్యుత్ సరఫరా అందజేశారు. గుడివాడ మండలం లింగవరం నుంచి 220/133కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి ముదినేపల్లి మండలం చిగురుకోటకు ప్రధాన విద్యుత్ మార్గం టవర్ల ద్వారా ఏర్పాటు చేశారు. గుడివాడ రూరల్ మండలం మోటూరు వద్ద ఒక టవర్ విరిగి చెరువులోకి కూలిపోయింది. కైకలూరు నియోజకవర్గంలో గృహావసరాలకు 90 శాతం విద్యుత్ సరఫరా పునరుద్ధరించినట్టు విద్యుత్ అధికారులు తెలిపారు. ఆక్వా రైతంగానికి 30 శాతం సమస్య ఉందని వాటిని కూడా త్వరితగతిన అధిగమించేలా పనులు నిర్వహిస్తున్నట్టు కైకలూరు విద్యుత్‌శాఖ ఏడీఏ రామయ్య తెలిపారు.

ముదినేపల్లి మండలంలో చిగురుకోట 132 కేవీ సబ్ స్టేషన్‌కు అనుసంధానంగా కొత్తపల్లి, సింగరాయపాలెం, చిగురుకోట 33 కేవీ, 11 కేవీ సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ లైన్ల పునరుద్ధరణ పనులు నిర్వహిస్తున్నప్పటికీ మూడు రోజుల వరకు పూర్తిస్థాయి విద్యుత్ సరఫరా కాదని అధికారులు చెబుతున్నారు. అన్నవరం, కొత్తపల్లి, బొమ్మినంపాడు, అల్లూరు తదితర గ్రామాల్లో చెట్లు కూలి తెగిన విద్యుత్ లైన్ల పునరుద్ధరణతో పాటు, చిగురుకోట సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఏఈ పూర్ణచంద్రరావు తెలిపారు.

వనామికి విద్యుత్ షాక్

కలిదిండి మండలంలో రాత్రంతా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పలు గ్రామాల్లో చెరువుల్లో ఏరియేటర్లు స్థంభించి ఆక్సిజన్ కొరత ఏర్పడింది. రొయ్యలు మృత్యువాత పడటంతో లక్షలాది రూపాయల నష్టం వాటిల్లింది. చిన్న సైజు రొయ్యలు చనిపోతుండటంతో ఆకివీడు, ఏలూరు మార్కెట్ అయినకాడికి అమ్ముకుంటున్నారు. విద్యుత్ సరఫరా అంతరాయంతో రైతులు జనరేటర్లను అద్దెకు తెచ్చి ఏరియేటర్లను తిప్పుతున్నారు. ట్రంప్ సుంకం దెబ్బ నుంచి కోలుకుంటున్న తరుణంలో రొయ్యలు పెద్ద సైజు కాకుండానే చనిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

అధికారితో..

ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్

జిల్లాలో ఖరీఫ్ వ్యవసాయ సాగులో విత్తనాలు, ఎరువులు సరఫరాలో తలెత్తే సమస్యలు, పచ్చిరొట్ట ఎరువులు పంపిణీ, ప్రకృతి వ్యవసాయం, వ్యవసాయ యాంత్రీకరణ వంటి పలు అంశాలపై ఈనెల 16వ తేదీ బుధవారం ఉదయం 11గంటల నుంచి 12 గంటల మధ్య ఆంధ్రజ్యోతి ఫోన్‌ఇన్ కార్యక్రమం నిర్వహించనుంది. ప్రజలు 83310 56634 నంబరుకు ఫోన్ చేసి సమస్యలను, సందేహాలను తెలిపితే.. వాటి పరిష్కారానికి జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ హబీబ్‌బాషా చర్యలు తీసుకుంటారు.

అదనపు భారం

విద్యుత్ అదనపు లోడు క్రమబద్ధీకరించుకోవాలి



- అదనపు లోడుకు చార్జీల వసూలు
- గృహ వినియోగదారులకు షాక్
- క్రమబద్ధీకరణ చార్జీల్లో రాయితీ
- వినియోగం నియంత్రణ చర్యలు
- దరఖాస్తులు కోరినా స్పందన కరువే
- వినియోగదారుల్లో ఆగ్రహం

జిల్లాలో గృహ విద్యుత్ కనెక్షన్లు : 4.6 లక్షలు
అదనపు లోడు చెల్లింపు దరఖాస్తులు : 2,500
అదనపు చార్జీలపై రాయితీ : 50 శాతం

గృహ విద్యుత్ వినియోగదారుల నుంచి సాధ్యమైనంత మేర అదనపు లోడు చార్జీలు రాబట్టేందుకు ఈపీడీసీఎల్ సంస్థ ప్రయత్నిస్తోంది. ఇప్పటికే అదనపు విద్యుత్ చార్జీల వసూళ్లకు వీలుగా రాయితీలు ప్రకటించింది. నిర్దిష్ట గడువు తేదీ లేకుండా వినియోగదారులను అప్రమత్తం చేస్తోంది. చాన్నాళ్ల క్రితమే అదనపు లోడుకు అనుగుణంగా చార్జీలు వసూలు చేయాలని భావించినా అప్పట్లో అది సాధ్యం కాలేదు. తిరిగి మరోసారి వసూళ్లకు ప్రయత్నాలు ఆరంభమయ్యాయి.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

మీ ఇంటి అవసరాల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రకారమే విద్యుత్ వినియోగించుకుంటున్నారా..? లేదా అదనపు వినియోగానికి పాల్పడుతున్నారా.. అదనమైతే తక్షణం ఈపీడీసీఎల్‌కు రాయితీ మేరకు చార్జీలు కట్టి తీరాల్సిందే. ఆ మేరకు తక్షణమే స్పందించని వినియోగదారులందరూ విద్యుత్ సంస్థ వంద శాతం వేసే అదనపు లోడు చార్జీలను భరించాలి. వాస్తవానికి గృహ అవసరాల నిమిత్తం దరఖాస్తు చేసుకున్న ప్రకారమే విద్యుత్ వినియోగించుకోవాలి. ఈ మేరకు విద్యుత్ పంపిణీ వ్యవస్థ ఎక్కడికక్కడ లోడు బేరీజు వేసుకుని సరఫరాకు సిద్ధమవుతూ వస్తోంది. కానీ దరఖాస్తులో చూపిన లోడు కంటె అదనంగా విద్యుత్ వినియోగం అవుతోంది. కేవలం రెండు గదులున్న ఇంటికి అవసరమైన సామర్థ్యం మేరకు విద్యుత్ కనెక్షన్ తీసుకునేటప్పుడు వినియోగదారులందరూ అంగీకార పత్రం సమర్పించారు. తర్వాత దరఖాస్తుదారు అదనంగా విద్యుత్ వినియోగిస్తున్నారు. ఏసీలు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మిషన్, హీటర్‌తో సహా తదితర విద్యుత్ ఉపకరణాలను అత్యధికంగా వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో డిమాండ్, సప్లయ్ మధ్య అంతరం పెరిగి అనేకమార్లు సరఫరాలో ఆటంకాలు ఎదురవుతున్నాయి. ప్రత్యేకించి వేసవి సీజన్‌లో విద్యుత్ వినియోగం రెట్టింపవుతోంది. ఈ పరిస్థితులను ఎదుర్కోవడానికి ఈపీడీసీఎల్ నానా తంటాలు పడుతోంది. ప్రత్యేకించి విద్యుత్ కోతలు లేకుండా ప్రణాళికలు వేసుకుని ఏటా కసరత్తు చేయాల్సి వస్తోంది. వ్యవసాయ అవసరాలకు రెండు గంటలపాటే విద్యుత్ సరఫరా చేసి గృహ, వాణిజ్య అవసరాలకు అత్యధిక విద్యుత్ సరఫరా చేయాల్సి వస్తోంది. విద్యుత్ వాడకాన్ని శృతిమించి వినియోగిస్తున్న వారి నుంచి కొంతమేర చార్జీలు (తరువాయి 8వ పేజీలో)

విద్యుత్ కోటాకు అనుగుణంగా వినియోగం

ఏలూరు సిటీ: జిల్లాలో ప్రస్తుతం విద్యుత్ కోటాకు అనుగుణంగానే విద్యుత్ వినియోగం జరుగుతోంది. ఏలూరు విద్యుత్ సర్కిల్‌లో విద్యుత్ డిమాండ్‌కు సరిపడా విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉన్నాయి. 27 మండలాల్లో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లు 141 ఉన్నాయి. 220 కేవీ, 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లు 7 ఉన్నాయి. ట్రాన్స్‌ఫార్మర్లు ఇబ్బందులు తలెత్తినప్పుడు మార్చడానికి ప్రతి డివిజన్‌లో సరిపడా విద్యుత్ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. వేసవిలో మెరుగైన విద్యుత్ సరఫరాకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసినట్టు విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు.





జాతీయ రహదారుల నిర్మాణ పనులు వేగవంతం

ఇన్‌చార్జి కలెక్టర్ ధాత్రిరెడ్డి

ఏలూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జాతీయ రహదారి నిర్మాణ పనులకు భూసేకరణ వేగవంతం చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్‌లో అధికారులతో మంగళవారం ఆమె సమీక్షించారు. ఖమ్మం నుంచి దేవరపల్లి 365 బీజీ (గ్రీన్‌ఫీల్డ్ హైవే)కు సేకరించిన భూముల్లో కొందరి రైతులకు పరిహారాన్ని వెంటనే చెల్లించి భూములను స్వాధీనం చేసుకోవాలన్నారు. హెచ్‌టీ విద్యుత్ లైన్ల షిఫ్టింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. పామర్రు- దిగమర్రు 165 జాతీయ రహదారి నిర్మాణంలో కైకలూరు మండలం గోనెపాడు తదితర గ్రామాల్లో భూసేకరణ పూర్తి చేయాలన్నారు. జీలుగుమిల్లి- పట్టిసీమ రహదారి నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలరు. డీఆర్వో వి.విశ్వేశ్వరరావు, ఆర్డీవోలు అచ్యుత్ అంబరీష్, రమణ, ఎన్‌హెచ్ సంస్థ అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

రెవెన్యూ బదలాయింపులు, 22(ఎ), అసైన్మెంట్, జీవోనెం:30 రెగ్యులేషన్, ఆర్‌వోఆర్ చట్టాలలో సవరణలు, తదితర అంశాలపై సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనలు, తదితర అంశాలపై రెవెన్యూ శాఖ పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు.

జిల్లా విపత్తుల నిర్వహణాధికారిగా భవాని

ఏలూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా విపత్తుల నిర్వహణాధికారి(డీపీఎం)గా కె.భవాని నియమితులయ్యారు. డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఆమె కొంత కాలంగా పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్నారు. జిల్లాలో విపత్తుల నిర్వహణకు ఆమె చర్యలు తీసుకుంటారు. సూచనలు, సలహాలు కూడా జారీ చేయనున్నారు.

ఇడా ఏవో బదిలీ

ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఇడా) అడ్మినిస్ట్రేషన్ అధికారి డీటీవీ కృష్ణారావు అమరావతి సచివాలయ గ్రీవెన్స్‌సెల్ విభాగానికి బదిలీ చేస్తే పురపాలకశాక ఉత్తర్వులు జారీ చేసింది.

ఇంటర్వ్యూ..

రోడ్లు అభివృద్ధి చేస్తున్నాం



పి.భరతరత్నం, ఎస్ఈ
రోడ్లు, భవనాలశాఖ

ఉమ్మడి జిల్లాలో ప్రమాద రహితంగా రహదారులను తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నాం. మొదటి ప్రాధాన్యతగా రహదారులపై గుంతల పూడిక నెలాఖరుకు పూర్తి చేస్తాం. తర్వాత 500 మీటర్ల పాడైన రోడ్లపైన బీటీ లేయర్లు వేసి సరిచేస్తామని రోడ్లు, భవనాల శాఖ (ఆర్‌అండ్‌బీ) సూపరింటెండెంట్ ఇంజనీర్ పి.భరతరత్నం తెలిపారు. గతంలో టెండర్లు వేయడానికి కాంట్రాక్టర్లు భయపడేవారని, తాజాగా పాత బకాయిలను క్లియర్ చేయడంతో ముందుకు వస్తున్నా రని తెలిపారు. రహదారుల పనులపై ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో ఆయన తెలిపిన వివరాలు.. **- ఏలూరు, ఆంధ్రజ్యోతి**

? రోడ్ల మరమ్మతులకు నిధులు విడుదల..

ఎస్ఈ : ఉమ్మడి జిల్లాలో రహదారిపై గుంతలు పూడ్చడానికి, బీటీ వేయడానికి, పూర్తిగా దెబ్బతిన్న రోడ్లను అభివృద్ధి చేయడానికి 174 పనులకు రూ.97.90 కోట్లు మంజూరయ్యాయి. 153 పనులు గ్రౌండింగ్ అయ్యాయి. మిగతావి వివిధ దశల్లో ఉన్నాయి. త్వరలో రూ.42 కోట్లతో సీ కేటగిరి రోడ్లు అభివృద్ధి చేస్తాం.

? వంతెనల ప్రతిపాదనల పరిస్థితి..

ఎస్ఈ : గత ప్రభుత్వంలో నారాయణపురంలో రూ.12 కోట్లు, గణపవరంలో రూ.8 కోట్లు, కోపల్లి వద్ద రూ.7 కోట్లతో వంతెనల అభివృద్ధి పనులు టెండర్ల దశలో నిలిచిపోయాయి. వాటికి అంచనాలు వేసి త్వరలో రీ టెండర్లు పిలుస్తాం.

? న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు(ఎన్‌డీబీ) పనులు..

ఎస్ఈ : టీడీపీ ప్రభుత్వ హయాంలో 2019లో ఒప్పందమైన పనులు పూర్తి చేయడానికి అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నాం. రాష్ట్ర హైవే పరిధిలోని ఏలూరు-కైకలూరు పరిధిలో 6.7 కిలోమీటర్లు రోడ్డు, శ్రీపర్రు వద్ద బ్రిడ్జి వద్ద నిర్మాణం రూ.21.89 కోట్లతో పనులు పూర్తి చేశాం. ఏలూరు-పెరికేడులో 18 కిమీకు రూ. 55.35కోట్లు, దెందులూరు- పంగిడిగూడెం 8.6 కిమీకు రూ.10.90 కోట్లు, ఏలూరు-జంగారెడ్డిగూడెం 5.96 కిమీకు రూ.11.77 కోట్లతో పనులు చేపట్టి పూర్తి చేస్తాం.

? గ్రామీణ రహదారుల ప్రతిపాదనలు..

ఎస్ఈ : గ్రామీణ ప్రాంతాల్లో కిలోమీటరు, అంతకన్న తక్కువ ఉన్న గ్రావెల్, మట్టి రోడ్లను బీటీ వేయడానికి నాబార్డు రుణం కోసం ఆర్‌ఐడిఎఫ్ కింద 13.40 కోట్లతో ప్రతిపాదనలు పంపించాం.

? ప్రధాన రహదారుల విస్తరణ, అభివృద్ధి..

ఎస్ఈ : ఎమ్మెల్యేల నుంచి ప్రతిపాదనలు వచ్చాయి. వాటిని క్రోడీకరించి జిల్లాలో సెంట్రల్ రోడ్డు ఫండ్ (సీఆర్ఎఫ్) కింద 22 ప్రధాన పనులకు రూ.582 కోట్లతో ప్రతిపాదనలు పంపించాం. విజయవాడ చీఫ్ ఇంజనీర్ పరిశీలనలో ఉన్నాయి. రోడ్ల విస్తరణ, రెండువైపుల రహదారుల అభివృద్ధికి చర్యలు చేపడతాం. ఈ విడత నిధులు విడుదలవుతాయని ఆశిస్తున్నాం.

? ఇంజనీర్ల కొరత.. ఇబ్బందులు..

ఎస్ఈ : జిల్లాలో 15 మంది అసిస్టెంట్ ఇంజనీర్లకు ఐదుగురే ఉన్నారు. 10 మంది ఇంజనీర్ల కొరత ఉందని ప్రభుత్వానికి నివేదించాం. ఆయా మండలాల్లో డిప్యూటీ ఇంజనీర్లు పర్యవేక్షణ చేస్తున్నారు. వర్క్ ఇన్‌స్పెక్టర్లు, గ్యాంగ్ మజ్దూర్ సిబ్బంది పోస్టులు భర్తీ జరగడం లేదు.

పాఠశాలల్లో ల్యాబ్‌లకు పరికరాల పంపిణీ

మెరుగైన ఫలితాలు సాధించాలి : ఎంపీ మహేశ్



సైన్స్ పరికరాలు పంపిణీ చేస్తున్న ఎంపీ మహేశ్

ఏలూరు టూటౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకునేందుకు పాఠశాల సైన్స్ ల్యాబ్‌లకు పరికరాలను పంపిణీ చేస్తున్నట్లు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ తెలిపారు. 10వ డివిజన్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఎంపీ మాట్లాడుతూ జిల్లాలో 50 ప్రభుత్వ పాఠశాలలకు రూ.2 కోట్లు విలువైన పరికరాలను అందిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని మంచి ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య, మేయర్ షేక్ నూర్జహాన్, జడ్పీ చైర్మన్ గంటా పద్మశ్రీ, ఇన్‌ఛార్జ్ కలెక్టర్ ధాత్రిరెడ్డి, ఎస్పీ కె.ప్రతాప్‌శివకిశోర్, డీఈవో వెంకటలక్ష్మమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది, పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి భరోసా

పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం పూర్తి భరోసా కల్పిస్తుందని ఎంపీ పుట్టా మహేశ్ అన్నారు. ఎంపీ క్యాంపు కార్యాలయంలో మంగళవారం సీఎంఆర్ఎఫ్, ఎల్‌ఓసీల ద్వారా 60 మందికి రూ.58.47 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, ఆరోగ్యం కోసం చిత్తశుద్ధితో పని చేస్తున్నామన్నారు. ప్రాణపాయ స్థితిలో ఆసుపత్రిలో చేరిన పేదలకు సీఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. ఇప్పటి వరకు ఎంపీ కార్యాలయం ద్వారా రూ.2కోట్లు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశామన్నారు. పార్టీలకు అతీతంగా ఎవరైనా ఎంపీ కార్యాలయానికి వచ్చి సహాయం కోరవచ్చన్నారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ గంటా పద్మశ్రీ ప్రసాద్, ఏఎంసీ చైర్మన్ గారపాటి రామసీత, తదితరులు పాల్గొన్నారు.


వైద్య సిబ్బందికి షోకాజ్ నోటీసులు

ముఖ ఆధారిత హాజరు నమోదులో అక్రమాలు

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ముఖ ఆధారిత హాజరు నమోదులో ట్యాంపరింగ్ చేసిన పీహెచ్‌సీలు, అర్బన్ పీహెచ్‌సీల వైద్యాధికారులు, ల్యాబ్ టెక్నీషియన్‌కు ఉన్నతాధికారులు మంగళవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. హాజరు ట్యాంపరింగ్‌తో విధులకు డుమ్మాకొడుతున్నట్టు ఈ నెల 10న స్టేట్ నోడల్ అధికారి గుర్తించి చర్యలకు ఉపక్రమించారు. సమీప సబ్ సెంటర్లను మ్యాపింగ్ చేసుకుని హాజరు నమోదుచేసి వెళ్లిపోతున్నట్టు కొందరిపై అభియోగాలు వచ్చాయి. ఐఫోన్లతో టైం, డేట్ సైతం ట్యాంపరింగ్‌చేసి విధులకు హాజరవుతున్నట్టు చూపుతున్నారని మరికొందరిపై ఆరోపణలు వస్తున్నాయి. రాష్ట్ర కార్యాలయం నుంచి సంబంధిత ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయని, ఎవరికి నోటీసులు వచ్చాయన్న సమాచారం తన వద్ద లేదని జిల్లా వైద్యాధికారి డాక్టర్ మాలిని మంగళవారం తెలిపారు. ముదినేపల్లి, తాడువాయి, రాఘవాపురం, పూళ్ల, ఎల్ఎన్‌డీ పేట, వెంకటాపురం అర్బన్ పీహెచ్‌సీ, పలు పీహెచ్‌సీల వైద్యసిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీచేసినట్టు సమాచారం. ఈ తాఖీదులను అందుకున్నవారు వెంటనే వివరణ ఇచ్చినట్టు తెలిసింది. తదుపరి పరిణామాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ముఖ ఆధారిత హాజరు నమోదు జిల్లా నోడల్ అధికారి భార్గవి వివరణ కోసం ప్రయత్నించగా ఆమె స్పందించలేదు.

పార్కుల్లో పచ్చదనం

అభివృద్ధికి అమృత్ మిత్రలు
- ఏలూరు, భీమవరం, తాడేపల్లిగూడెంలలో ఆరు పార్కులు మహిళా సంఘాలకు అప్పగింత
- ఏడాదిపాటు మొక్కలు నాటి సంరక్షించాలి
- ఒక్కో పార్కుకు నాలుగు నుంచి రూ.8 లక్షలు



ఏలూరు పార్కులను పరిశీలిస్తున్న అధికారులు

భీమవరం టౌన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): పార్కుల సుందరీకరణ బాధ్యతలను మహిళా గ్రూపులకు అప్పగించనున్నారు. అమృత్‌లో భాగంగా 'అమృత్ మిత్ర' పథకానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో భీమవరంలో రెండు, తాడేపల్లిగూడెంలో రెండు, ఏలూరు కార్పొరేషన్‌లో రెండు పార్కులను గుర్తించి అభివృద్ధి చేయనున్నారు. గతంలో తాడేపల్లిగూడెం పార్కును మహిళలకు అప్పగించారు. అగ్రిమెంట్ పూర్తి కావడంతో మరో ఏడాది పొడిగించారు. భీమవరం, ఏలూరు కార్పొరేషన్‌లో ఈ ఏడాదిలో కొత్తగా పార్కులను ఎంపిక చేయనున్నారు.

మహిళలు ఏం చేయాలి ?

పార్కులకు సమీప మెప్మా మహిళా సంఘానికి పార్కు బాధ్యతను అప్పగిస్తారు. సంఘ సభ్యులు పార్కులో మొక్కలతోపాటు కొత్తవి నాటి వాటిని సంరక్షిస్తూ పచ్చదనం మెరుగుపర్చాలి. ఇందుకు ఏపీ యూఎఫ్ఐడీ ద్వారా పార్కుల స్థలాన్ని బట్టి గ్రూపునకు ఏడాదికి నాలుగు నుంచి ఎనిమిది లక్షల వరకు ఇస్తారు. పార్కుల కేటాయింపు, నిధులన్నీ మునిసిపల్ కమిషనర్ ద్వారానే అప్పగిస్తారు. నిర్వహణపై మునిసిపల్ కమిషనర్, ఇంజనీర్లు ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుంది. పార్కుల అభివృద్ధి వల్ల పర్యావరణ పరిరక్షణ అక్కడ ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించడానికి వీలు కలుగుతుంది. దీని ద్వారా ఒక గ్రూపులోని సభ్యులకు జీవనోపాధి కల్పిస్తారు. ఏడాదిపాటు అగ్రిమెంట్ ఇస్తారు. అవసరాన్ని బట్టి పొడిగిస్తారు. ఈ మూడు ప్రాంతాల్లోను 'అమృత్ మిత్ర' పేరున ఆరు గ్రూపులను గుర్తించి ఒప్పందాలు కుదుర్చుకున్నారు. వీరికి శిక్షణ ఇవ్వడంతో త్వరలోనే పనులు ప్రారంభమవుతాయి.


కొత్తగా 166 టీచరు పోస్టుల మంజూరు

మెగా డీఎస్సీ రిక్రూట్‌మెంట్‌తో కలిపి
మొత్తం 1,201 పోస్టుల భర్తీకి అవకాశం
'ప్రత్యేక' పోస్టుల ఎంపిక విధి విధానాలపై భిన్నాభిప్రాయాలు

7

హలో వినిపిస్తోందా..?

సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవ్ చేస్తే ప్రాణాలకు ముప్పు
జరిమానాలు విధిస్తున్నా తీరు మారడం లేదు



సుందరగిరికి మహర్దశ

ఆలయానికి 30 ఎకరాల భూమి
కేటాయింపుపై మంత్రివర్గం ఆమోదం

6



లక్ష్మీనరసింహుని ఆలయం



యజ్ఞక్రతువులో పాల్గొన్న పవన్ కల్యాణ్ (ఫైల్)

సుందరగిరికి మహర్దశ

లక్ష్మీనరసింహుని ఆలయానికి 30 ఎకరాలు కేటాయిస్తూ మంత్రి వర్గం ఆమోదం

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): సుందరగిరిపై కొలువైన లక్ష్మీనరసింహుని ఆలయ అభివృద్ధి కోసం 30 ఎకరాల ప్రభుత్వ భూమిని దేవదాయశాఖకు కేటాయించేందుకు చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో మంగళవారం జరిగిన ఇ-క్యాబినెట్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. మహిమాన్వితమైన ఈ ఆలయం మరింత అభివృద్ధి అవుతుందని పలువురు భక్తులు, స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల మండలంలోని ఐఎస్ రాఘవారం శివారు ఐఎస్ జగన్నాథపురంలోని సర్వే నెంబరు 425/193లోని 30 ఎకరాల భూమిని కేటాయించేందుకు ప్రభుత్వం సంకల్పించింది. జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి ఐఎస్ జగన్నాథపురం గ్రామానికి గతేడాది డిసెంబరు 10న విచ్చేశారు. గ్రామంలో ఈ భూమి ఎక్కడ ఇవ్వాలి అన్న దానిపై ఆమె పరిశీలించారు. అక్కడ గ్రామ రికార్డులు, మేప్‌లను చూశారు.

డీసీఎం పవన్ ప్రత్యేక దృష్టి

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గతేడాది నవంబర్ 1న జగన్నాథపురంలో దీపం-2 పథక ప్రారంభోత్సవానికి వచ్చిన సమయంలో ముందుగా ఆయన ఆలయ యాగశాలకు వెళ్లి అక్కడ సుదర్శన నృసింహ ధన్వంతరి హోమంలో పాల్గొన్నారు. అక్కడి ఆలయ భూముల రక్షణపై ఆరా తీశారు. భూములను అక్రమంగా తవ్వేశారని, అలాగే ఇందులో ఎన్నో అవకతవకలు చోటుచేసుకున్నాయని స్థానికులు కొందరు పవన్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన విచారణ జరిపి వారంలోగా నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్ వెట్రిసెల్విని ఆదేశించారు. పవన్‌కల్యాణ్ ఆదేశాలతో అధికార యంత్రాంగం ఒక్కసారిగా కదిలింది. జగన్నాథపురంలో కొండ తవ్వకాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.



భూమి కేటాయింపును పరిశీలించేందుకు వచ్చిన జేసీ ధాత్రిరెడ్డి (ఫైల్)

కనకదుర్గగా రాట్నాలమ్మ

పెదవేగి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పెదవేగి మండలం రాట్నాలకుంట రాట్నాలమ్మ తిరునాళ్ల నాలుగోరోజు మంగళవారం అమ్మవారు కనకదుర్గాదేవిగా దర్శనమిచ్చారు. ఒక చేతిలో ఖడ్గం, మరోచేతిలో త్రిశూలం, చేతిలో శంఖు చక్రాలతో, అభయప్రదాతగా దర్శనమి చ్చారు. 8 గంటలకు మేళతాళాలు, బేతాళ, కోలాట నృత్యాలు, సాయంత్రం 6 గంటలకు కోలాటం, రాత్రి 8 గంటలకు అమ్మ వారి తెప్పోత్సవం కనుల పండువగా జరిగింది. బుధవారం గంగా పార్వతీ సమేత రామ లింగేశ్వరస్వామి శాంతి కల్యాణం, భారీ అన్న సమారాధన ఉంటుందని ఈవో సతీష్ కుమార్ తెలిపారు.





గొల్లలకోడేరు-పాలకోడేరు బ్రిడ్జిపై పనులు చేపడుతున్న ఆర్‌అండ్‌బీ అధికారులు

అడ్డు తొలగించారు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పాలకోడేరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) 'తవ్వేశారు.. వదిలేశారు..' శీర్షికన ఆంధ్రజ్యోతిలో మంగళవారం వెలువడిన కథనానికి ఆర్ అండ్‌బీ అధికారులు స్పందించారు. గొల్లలకోడేరు-పాలకోడేరు గ్రామాలను కలుపుతూ యనమదుర్రు డ్రెయిన్‌పై నిర్మించిన వంతెన పాడవడంతో ఆర్‌అండ్‌బీ అధికారులు శుక్రవారం బ్రిడ్జిపై ఉన్న శ్లాబును తొలగించి అదే బ్రిడ్జిపై అడ్డంగా వేసేశారు. దీంతో బ్రిడ్జిపై నాలుగు రోజులుగా నడిచేందుకు కూడా వీలులేకుండా పోయింది.మంగళవారం ఆంధ్రజ్యోతిలో కథనం రావడంతో అధికారులు ఆ బ్రిడ్జిపై పెట్టిన సిమెంట్ దిమ్మలను తొలగించి వేశారు. బ్రిడ్జి చివరలో పెద్ద ఎత్తున సిమెంట్ దిమ్మలు అడ్డంగా పెట్టడంతో ప్రయాణికులు మంగళవారం సాయంత్రం నడిచి వెళ్ళే దారి వదలాలంటూ అధికారులను కోరడంతో నడక దారిన వెళ్లేవిధంగా దారిని వదిలారు.

పిల్లల చదువు కోసమో, వ్యాపారాల కోసమో మెరుగైన సౌకర్యాలు ఉన్న పట్టణ ప్రాంతాలకు జనం వెళుతున్నారు. పెరుగుతున్న జనాభాకు వసతి కష్టమవుతున్న పరిస్థితుల్లో అపార్టుమెంటు కల్చర్ పెరిగింది. అంతే కాకుండా నలుగురూ ఉంటారు.. రక్షణగా ఉంటారనే ఉద్దేశంతో ఎక్కువమంది అపార్ట్‌మెంట్లలో ఉంటున్నారు. అయితే అపార్టమెంట్లలో ఎంత వరకు రక్షణ చర్యలు చేపట్టారనే దానిపై చాలామందికి అవగాహన ఉండదు.. ముఖ్యంగా ఫైర్ సేఫ్టీ ఉండాలి.. రెండు రోజుల క్రితం ఏలూరులో ఒక అపార్టుమెంట్‌లో అగ్ని ప్రమాదం జరిగి ఒక ప్లాట్ మొత్తం ధ్వంసమైంది.. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగింది.. అసలు అపార్టుమెంట్ల నిర్మాణంలో నిబంధనలు పాటిస్తున్నారా ? అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటున్నారా ? అగ్ని ప్రమాదాలు సంభవించకుండా చేపట్టాల్సిన చర్యలపై ప్రత్యేక కథనం..



ఏలూరులో అగ్నిప్రమాదం సంభవించిన అపార్టుమెంట్ ఇదే..

అపార్టుమెంట్లలో రక్షణ ఎంత ?

ఏలూరు క్రైం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) :ప్రజల అభిరుచులను దృష్టిలో పెట్టుకుని నేడు గ్రామీణ ప్రాంతాల్లో కూడా అపార్టుమెంట్లు నిర్మిస్తున్నారు. రక్షణ, సౌకర్యాలు ఉన్నాయనే ఆలోచనతోనే చాలామంది అపార్టుమెంట్లకు వెళ్లిపోతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న కుటుంబాలు తమ పిల్లల చదువుకోసమో, ఉద్యోగాల కోసమో, వ్యాపారాల కోసమో సమీపంలోని మండల కేంద్రాలకు, పట్టణాలకు నగరాలకు వచ్చేయడంతో జనసాంద్రత పెరిగిపోతుంది. దీంతో ప్రధాన మైన సెంటర్లకు అందుబాటులో ఉండేవిధంగా తక్కువ స్థలంలోనే ఎక్కువ కుటుంబాలు నివాసం ఉండేలా అపార్టుమెంట్లను నిర్మిస్తు న్నారు. జిల్లాలో జీ+5 అంతస్తుల అపార్టుమెంట్లను నిర్మించడానికి అనుమతులు ఉన్నాయి. అయితే ఇవి కూడా 18 మీటర్లలోపు ఎత్తు ఉండాలి. వీటి నిర్మాణానికి స్థానిక సంస్థలే అనుమతులను మంజూరు చేస్తూ ఉంటాయి. 18 మీటర్లు దాటిన భవన నిర్మాణాలకు ఖచ్చితంగా అగ్నిమాపక అధికారుల అనుమతి కూడా తీసుకోవాల్సి ఉంటుంది. కానీ జిల్లాలో ఈ విధంగా అనుమతులు పొందినవి వేళ్లపైనే లెక్కపెట్టవచ్చు. జిల్లాలో ఏలూరు నగరంలో 500 అపార్టుమెంట్ల వరకూ ఉన్నాయి. మరికొన్ని నిర్మాణాలు జరుగుతున్నాయి. జంగారెడ్డిగూడెం, నూజివీడు, భీమడోలులో అపార్టుమెంట్లు ఉన్నాయి. మొత్తంమీద మరో 100 అపార్టుమెంట్లు జిల్లాలో ఉన్నాయి. నిబంధనల ప్రకారం ఫైర్ ఇంజన్ అపార్టుమెంట్ చుట్టూ తిరిగే విధంగా 20 అడుగుల ప్రదేశం వదలాలి. ఏలూరు నగరంలో అపార్టుమెంట్ కల్చర్ విపరీతంగా పెరిగిపోవడంతో గతంలో ఒకే కుటుంబం నివాసం ఉండే స్థలంలో ఉన్న ఇంటిని తొలగించి అదే ప్రాంతంలో 25 కుటుంబాల వరకూ నివాసం ఉండే విధంగా అపార్టుమెంట్లను నిర్మిం చేస్తున్నారు. ప్రతి అపార్టుమెంట్‌కు సాధారణంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రత్యేకంగా ఉంటుంది. ఇది లోపలే ఏర్పాటు చేసుకోవాల్సి ఉన్నా చాలావరకు అపార్టుమెంటు ముందు రోడ్డుపైనే ప్రమాదకర పరిస్థితుల్లోనే ఉన్నాయి. అపార్టుమెంట్ లోపల కూడా మీటర్ల బోర్డులు గజిబిజిగా అయోమయంగా ఉంటున్నాయి. సాధారణంగా అపార్టుమెంట్లలో రెండు ట్యాంకులు ఏర్పాటు చేసే ఉంచాలి. ఒకటి వారు వినియోగించుకోవడానికి మరొకటి అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు అత్యవసర పరిస్థితుల్లో వినియోగించడానికి నిర్మాణం చేసి ఉండాలి. కానీ రెండు ట్యాంకులు పెడుతున్నప్పటికీ నిత్యం వినియోగించుకునే వీలుగానే పైపు లైన్లను బిగించే ఉంచుతున్నారు. ఏదైనా ప్రమాదం సంభవించినప్పుడు వారంతా సురక్షితంగా కిందకు రావడానికి లిఫ్టు పక్కనే మెట్లతో పాటు ఈజీగా బయటకు వెళ్లిపోయేలా అదనంగా మెట్లు ఉండాలి.



ఏలూరులో అపార్టుమెంట్ ప్రమాదంలో ధ్వంసమైన ప్లాట్

- పెరుగుతున్న బహుళ అంతస్థుల కల్చర్
- గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు కుటుంబాల వలస
- తక్కువ స్థలంలోనే ప్లాట్‌ల నిర్మాణం
- నిబంధనలు పాటించని బిల్డర్లు
- ప్రమాదంలో అపార్టుమెంటు వాసులు

ప్రమాదాలు ఎందుకు జరుగుతాయంటే ?

సాధారణంగా కొంతమంది బిల్డర్లు నాణ్యమైన విద్యుత్ వైర్లను, స్విచ్ బోర్డులను వినియోగించకపోవడం వల్ల లూజు కనెక్షన్స్ , షార్టుసర్క్యూట్‌లు ఏర్పడుతున్నాయి. కిచెన్‌లో వెంటిలేషన్ సరిగా లేకపోవడం వల్ల గ్యాస్ లీకైతే హాలు, బెడ్‌రూమ్‌లలోకి గ్యాస్ విస్తరించి మంటలు వ్యాప్తి చెందుతున్నాయి. గ్యాస్ సిలెండర్ రబ్బరు ట్యూబ్‌లను సకాలంలో మార్చుకోకపోవడం, వంట అయిన తరువాత రెగ్యులేటర్‌ను కట్టివేయకపోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఏసీలు వినియోగించే వారు వాటిని రెగ్యులర్‌గా సర్వీసింగ్ చేయించుకోవడం, గ్యాస్ తక్కువగా ఉంటే వేడి ఎక్కువై పేలే ప్రమాదం ఏర్పడుతుంది. కంప్రెషర్ వేడి ఎక్కకుండా చూసుకోవాలి. ఓల్టేజీ హెచ్చుతగ్గుల వల్ల కూడా ప్రమాదం సంభవించే అవకాశం ఉంది. ఇంట్లో ఉన్న ఎలక్ట్రానిక్ వస్తువులకు స్టెబిలైజర్లను వినియోగించుకోవాలి.

ఏలూరు నగరంలోని శాంతినగర్ 7వ రోడ్డులోని హిమానీ అపార్టు మెంటులో టీవీ స్విచ్‌బోర్డు వద్ద షార్ట్‌సర్క్యూట్ అయి ఈనెల 12వ తేదీన అపార్టుమెంట్‌లోని ప్లాట్ దగ్ధమై 15 లక్షల రూపాయల ఆస్తి నష్టం జరిగింది. పొగలో ఐదుగురు చిక్కుబడిపోగా అగ్నిమాపక శాఖ అధికారులు వారిని కాపాడారు. అశోక్‌నగర్‌లోని సూర్య హైట్స్ అపార్టుమెంటులో ఈనెల 13వ తేదీ రాత్రి బాత్రూమ్‌కు ఉన్న ఎగ్జాస్ట్ ఫ్యాన్‌పై వర్షపునీరు పడ డంతో షార్ట్‌సర్క్యూట్ అయి ప్రమాదం సంభవించింది. సకాలంలో అగ్నిమాపక సిబ్బంది వెళ్లి విద్యుత్‌ను పూర్తిగా నిలిపి వేసి ప్రమాదం సంభవించకుండా మంటలను ఆర్పారు.



ఈనెల 13వ తేదీ రాత్రి అశోక్‌నగర్ సూర్యహైట్స్‌లో బాత్రూమ్ వద్ద ఎగ్జాస్ట్ ఫ్యాన్ నుంచి మంటలు

జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో మంచిది



అపార్టుమెంట్లలో తగిన జాగ్రత్తలు తీసుకోవడం వల్ల అగ్ని ప్రమాదాల నుంచి రక్షించుకోవచ్చు. సాధారణంగా 18 మీటర్ల ఎత్తు, ఆరు అంతస్తులు (గ్రౌండ్ ఫ్లోర్ +5 ఫ్లోర్స్) వరకూ అగ్ని మాపక శాఖ అనుమతులు అవసరం లేదు. ఆ పైన నిర్మాణాలు తలపెట్టే భవనాలు అన్నింటికి అగ్నిమాపకశాఖ అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. వ్యాపార వాణిజ్య భవనాలకు తప్పనిసరిగా అగ్నిమాపక అనుమతి తీసుకోవాలి. ఫైర్ ఎక్విప్‌మెంట్, హోజ్‌రీలు, డ్రమ్ కమ్మర్, పంపు, నాలుగు అంగుళాల పైప్‌లైను ప్రతి ఫ్లోర్‌కు కలుపుతూ ఉండాలి. ఫైర్ అలారం, 25 వేల లీటర్ల ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్, 10 హెచ్‌పీ ఫైర్ పంపు ఏర్పాటు చేయాలి. సీవో 2 ఫైర్ సిలెండర్లను అందుబాటులో ఉంచుకోవాలి. ప్రమాదం జరిగినప్పుడు తడిగుడ్డను ముక్కు వద్ద పెట్టుకుని మెట్ల పైన కూర్చుని నెమ్మదిగా దిగాలి. ఎట్టి పరిస్థితుల్లో లిఫ్టును ఉపయోగించకూడదు. పరుగులు పెట్టకూడదు.

\- రామకృష్ణ, అగ్నిమాపక శాఖ అధికారి, ఏలూరు

వేసవిలో ఈ జాగ్రత్తలు తీసుకోండి..

ఆకివీడు (ఆంధ్రజ్యోతి) : వేసవిలో అగ్నిప్రమాదాలు ఎక్కువగా జరుగుతాయి. కొన్ని ముందు జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలను అరికట్టవచ్చు.

- పిల్లలకు అగ్గిపెట్టెలు, లైటర్లు, టపాకాయలు, ఎలక్ట్రికల్ సామాగ్రితో పాటు ఇతర మండే పదార్థాలు అందుబాటులో ఉంచకూడదు. వంటింట్లో వెలుతురు ఉండేలా చూసుకోవాలి. గ్యాస్‌స్టౌ రబ్బరు ట్యూబ్ చెడిపోతే ఐఎస్‌ఐ మార్కు గల కొత్త ట్యూబ్‌ను వెంటనే మార్చుకోవాలి. వంటపని అయిన వెంటనే రెగ్యులేటర్ వాల్ బంద్ చేసుకోవాలి.
- ఇళ్లల్లో ఐఎస్‌ఐ మార్కు కల్గిన ప్రామాణికమైన విద్యుత్ పరికరాలు మాత్రమే ఉపయోగించాలి.విద్యుత్ ప్రమాదాలు జరిగినప్పుడు నీటిని వాడకుండా పొడి ఇసుకను మాత్రమే వాడాలి.

ఇంటి నుంచి ఎక్కువ రోజులు బయటకు వెళ్ళినప్పుడు ఎలక్ట్రికల్ మెయిన్ ఆఫ్ చేయాలి. ఉరుములు, మెరుపులతో భారీ వర్షం పడుతున్నప్పుడు టీవీ, ఫ్రిజ్ వంటి విద్యుత్ ఉపకరణాలను స్విచ్ ఆఫ్ చేయాలి

- ప్రమాదవశాత్తు దుస్తులకు నిప్పంటుకుంటే భయంతో పరుగెత్తకూడదు.. నేలపై దొర్లాలి..దుప్పటి చుట్టాలి. కాలిన శరీర భాగం మీద చల్లని నీరు పోయాలి. పొగతో నిండిన గదుల్లో మోచేతులు, మోకాళ్లపై పాకుతూ బయటకు వచ్చేప్రయత్నం చేయాలి. ముక్కుకు, నోటికి అడ్డంగా తడిగుడ్డ ఉంచడం ద్వారా పొగ, కార్బన్‌డయాక్సైడ్‌ని పీల్చకుండా ఆపవచ్చు.
- అగ్నిప్రమాద సమయంలో లిఫ్టను ఉపయోగించవద్దు. మెట్ల మార్గాన్నే వెళ్లాలి. విద్యుత్ పరికరాలకు నిప్పంటుకుంటే నీళ్ళతో ఆర్పవద్దు.. దీని వలన విద్యుత్ షాక్ తగిలి ప్రాణాపాయం కల్గవచ్చును. కరెంటు వెంటనే ఆపివేయాలి.



పెదపాటి రామకృష్ణ, వెంకట రాజర్షి

కందుకూరి విశిష్ట పురస్కారాలు

ఏలూరు/ కొయ్యలగూడెం, భీమవరం టౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి సందర్భంగా తెలుగు నాటకరంగ దినోత్సవం పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం జిల్లాస్థాయి విశిష్ట పురస్కారాలు అందించేందుకు రంగస్థల నటులను ఎంపిక చేసింది. ఏలూరుకు చెందిన పెదపాటి రామకృష్ణ, కొయ్యల గూడేనికి చెందిన మహాశివభట్ల వెంకటరాజర్షిలు ఎంపికయ్యారు. పెదపాటి రామకృష్ణ ఏలూరు ట్రాన్స్‌కోలో రిటైర్డ్ ఉద్యోగి, హేలా పురి కళాకారుల సంఘాన్ని స్థాపించి కళాకారులను ప్రోత్సహిస్తున్నారు. పలు నాటకాల్లో అవార్డులు అందుకున్నారు. ఇప్పటికే వందలాది అవార్డులు అందుకున్న రామకృష్ణకు ఈ అవార్డు వన్నెతెచ్చింది. కొయ్యలగూడేనికి చెందిన వెంకటరాజర్షి కూడా రంగస్థల నాటికల్లో నిష్ణాతుడు. పలు సినిమాల్లో కేరెక్టర్ ఆరిస్టుగా నిలిచారు. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ఎనిమిది మంది కళాకారులకు పురస్కారాలను ప్రకటించింది. వీరిలో అంబటి పెదవెంకట్రాజు, గుండా వెంకట సుబ్బారావు,మద్దిశెట్టి సునీతదేవి, పువ్వాడ విజయకుమారి, మానాపురం సత్యనారాయణ, టీవీఎం కృష్ణారావు, ఎం.భానుమతి, జి.నాగమణిలను ఎంపిక చేశారు. వీరికి ఈనెల 16న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే కందుకూరి వీరేశలింగం జయంతి సభలో పురస్కారాలతో పాటు పది వేల రూపాయల నగదు బహుమతి, ప్రశంసాపత్రం అందించనున్నారు.

నవ్వుల నారాయణ..

అతను వెండితెరపై కనిపిస్తేనే నవ్వు వస్తుంది.. తాగుబోతు పాత్ర చేయాలంటే అతనే చేయాలి.. అన్నంతగా ఆ పాత్రలో మెప్పించేవాడు.. సుమారు 700 పైగా సినిమాల్లో వివిధ పాత్రల్లో నటించి ప్రేక్షకుల మదిలో చెరగని ముద్రవేశారు.. వెండితెరపై నవ్వులు పూయించిన ఎంఎస్ నారా యణ మనవాడే.. ఏలూరు జిల్లా నిడమర్రు గ్రామానికి చెందిన మైలవరపు సూర్యనారాయణ (ఎం.ఎస్) జయంతి నేడు.. ఈ సందర్భంగా ప్రత్యేక కథనం..



- లెక్చరర్ నుంచి సినిమా నటుడిగా ప్రస్థానం
- కమెడియన్‌గా ప్రేక్షకుల మదిలో సుస్థిరస్థానం

నేడు ఎంఎస్ నారాయణ జయంతి

నిడమర్రు ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : తాగుబోతు పాత్రలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచి తనకంటూ చిత్రసీమలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకొని సుమారు 17 సంవత్సరాల పాటు సినిమా రంగంలో ఉంటూ 700లకు పైగా సినిమాలలో నటించారు. చదువుకొనే వయసు నుంచి ఎం.ఎస్‌కు నాటకాలంటే మహాపిచ్చి. కళాశాలలో తోటి స్నేహితులతో కలసి బాల నాగమ్మ, భట్టి విక్రమార్కుడు మొదలగు నాటకాలు వేసి అందరి మన్ననలు పొందారు. భీమవరం కేజీఆర్‌ఎల్ కళాశాలలో తెలుగు లెక్చరర్‌గా పనిచేస్తూ సినిమా అంటే పిచ్చితో ప్రతి ఆదివారం చేతిలో సొమ్ములేకపోయినా అప్పు చేసి మరీ ఓ కథతో సర్కారు ఎక్స్‌ప్రెస్ ఎక్కేసే వారు. తెలిసిన నిర్మాతల వద్దకు, దర్శకుల వద్దకు వెళ్లి రాసుకొన్న కథలను వినిపిస్తూ సినిమా అవకాశాల కోసం ఎన్నో వ్యయప్రయాసలు పడ్డారు. దర్శకుడు రవిరాజా పినిశెట్టి వద్ద కథా రచయితగా వేగుచుక్క పగటిచుక్క సినిమాకు తొలిసారి చిత్ర రంగలో ప్రవేశించారు. తర్వాత మరికొన్ని సినిమాలకు కథారచన చేసినప్పటికీ నటుడుగా పరిచయం అయిన తొలి సినిమా ఎం.ధర్మరాజు ఎం.ఏ.. ఈ సినిమాలో హాస్యనటుడు పాత్ర కోసం దర్శకుడు రవిరాజా పినిశెట్టి వెతుకుతుండగా సహాయ దర్శకుడు వచ్చి "అక్కడ ఇక్కడా వెతకడం ఎందుకు సార్ మన కథా రచయిత ఎం.ఎస్ నారాయణ ఈ పాత్రకు చక్కగా సరిపోతాడు" అని సూచించాడు. దర్శకుడు వచ్చి అడిగే సరికి ఎం.ఎస్ మొహమాటపడి సార్.. నేను కాలేజి లెక్చరర్‌ని.. కమెడి యన్‌గా చేయడం బాగోదేమో.. అని సంశయిస్తుండగా "నీలో ఓ మంచి నటుడు ఉన్నాడోయ్..ఈ పాత్ర చెయ్ నీకు మంచి పేరు వస్తుంది.." అంటూ బలవంతంగా ఈ పాత్రకు వేషం వేయించినట్టు ఎం.ఎస్ ఓ ఇంటర్వ్యూలో స్వయంగా తన సినీ ప్రస్థానం గురించి చెప్పారు.

ఈవీవీ సత్యనారాయణ దర్శకత్వంలో మా నాన్నకు పెళ్లి సినిమాలో తాగుబోతు పాత్ర సినీ ప్రేక్షకుల గుండెల్లో ఎం.ఎస్‌కు సుస్థిరం స్థానం కల్పించింది.ఆ సినిమా తర్వాత తాగుబోతు చేయాలన్నా ఎం.ఎస్ నారాయణ అయితే బాగుంటుందని అనుకునేవారు. సుమారు 200 పైగా తాగుబోతు పాత్రల్లో నటించి ఆయన ప్రేక్షకులను మెప్పించారు. హాస్యనటుడుగా ఎన్నో విభిన్న పాత్రలతో బిజీగా ఉన్న సమయంలో తనలో ఉన్న రచయిత, దర్శకుడుని బయటకు తీసుకొని రావాలనే ఆకాంక్షతో తన కుమారుడు విక్రమ్ హీరోగా 'కొడుకు' సినిమా తీశారు. సినిమా బాగుందని ప్రశంసలు పొందినప్పటికీ కర్షియల్‌గా ఆయనకు తీవ్ర నష్టాలనే మిగిల్చింది. తర్వాత భజంత్రీలు అనే సినిమాకు కూడా దర్శకత్వం వహించారు

నటుడుగా ఎంత బిజీగా ఉన్నా సంక్రాంతి పండుగకు మాత్రం తన స్వగ్రామం నిడమర్రులో వాలిపోవడం ఆయనకు చాలా ఇష్టం. ఆ పండుగ నాలుగు రోజులు తన స్నేహితుల, బంధవులతో కలసి గ్రామంలో తిరిగేవారు. 2017 జనవరిలో సంక్రాంతి పండుగకు నిడమర్రు వచ్చిన ఆయన చిన్నపాటి అనారోగ్యానికి గురయ్యారు.. వారం రోజుల పాటు గ్యాస్ ట్రబుల్‌తో ఇబ్బంది పడుతూ చివరికి హైదరాబాదులో జనవరి 23న తనువు చాలించారు.



ఎంఎస్ నారాయణ నటించిన సినిమాల్లో కొన్ని పాత్రల్లో..

మా మనసుల్లో ఉన్నాడు



మా అన్నయ్య సినీ ఇండ్రస్టీలో ఉన్నత స్థానంలో చాలా బిజీగా ఉన్నా ఆయన మనసు సొంత గ్రామం నిడమర్రు వైపే ఉండేది. ఖాళీ సమయం దొరికితే చాలు నిడమర్రు వచ్చి వాలిపోయేవారు. ఆయన చిన్ననాటి నుంచి చదువులో ముందుంటూ కష్టపడి పనిచేసే తత్వం గలవాడు. ఆయనకు వ్యవసాయం అంటే మహా ఇష్టం. చిన్నతనంలో పొలాల్లో పనిచేస్తూ కారెంతో చేలకు నీళ్లు పెట్టిన రోజులు ఇంకా నా మదిలో మెదులుతూనే ఉన్నాయి. ఆయన భౌతికంగా లేకపోయినా మా మనసులో, మా గ్రామస్థుల గుండెల్లో ఉన్నారు.

మైలవరపు లాలయ్య, ఎం.ఎస్ నారాయణ సోదరుడు, నిడమర్రు



వసతి గృహాలకు సరఫరా చేసిన కొత్త వంట సామగ్రి

హాస్టళ్లకు హంగులు

సాంఘిక సంక్షేమ వసతి గృహాలకు మరమ్మతులు

కిటికీలకు దోమతెరలు.. 30 రకాల కొత్త వంట సామగ్రి సరఫరా

ఏలూరురూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలోని వసతి గృహాల రూపురేఖలు మారనున్నాయి. భవనాల మరమ్మతులు, మౌలిక సదుపాయాల కల్పనకు ఒక్కో వసతి గృహానికి రూ.10 లక్షలు నుంచి రూ.20 లక్షల వరకు ప్రభుత్వం మంజూరుచేసింది. ఏలూరు జిల్లాలో మొత్తం 59 హాస్టళ్లు ఉన్నాయి.వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే నాటికి పనులు పూర్తి చేసి విద్యార్థులకు అందు బాటులోకి తీసుకురావడానికి అధికారులు కృషి చేస్తున్నారు. సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలో 59 వసతి గృహాలు ఉన్నాయి. వీటిలో సుమారు ఏడు వేల మంది విద్యార్థులు ఉంటున్నారు. వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లు ఒక్క ఏడాది కూడా మరమ్మతులకు నిధులు విడుదల చేయలేదు. పలు భవనాల స్లాబ్‌లు పెచ్చులూడి ఇనుప ఊచలు బయటకు కనిపించేవి. మరుగుదొడ్లకు తలుపులు సరిగ్గా లేవు. విద్యుత్ వైర్లు అస్తవ్యస్తంగా ఉండేవి. తాము అధికారంలోకి వచ్చిన ఏడాదిలోగా సంక్షేమ వసతిగృహాలకు మరమ్మతులు చేపట్టి మౌలిక సదుపాయాలు కల్పిస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తరువాత వసతి గృహం గృహాల స్థితిగతులు, మరమ్మతులకు ఎన్ని నిధులు అవసరమవుతాయో నివేదిక పంపాలని సాంఘిక సంక్షేమశాఖ అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. దీంతో అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపడంతో ఇటీవల నిధులు విడుదలయ్యాయి. మరమ్మతులు ఏపీ మౌలిక వసతుల కల్పన ఇంజనీరింగ్ విభాగం చేపట్టింది. తాగునీరు, డ్రెయినేజీ, మరుగుదొడ్లు, విద్యుత్, ఫ్లోరింగ్, కిటికీలకు దోమ తెరలు ఏర్పాటు చేస్తున్నారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభంనాటికి మరమ్మతులు పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తెస్తామని అధికారులు చెబుతున్నారు. వంట పాత్రలు, ఇతర సామాగ్రి పాతబడిపోయి వంట కార్మికులు ఇబ్బంది పడు తుండడంతో అన్ని హాస్టళ్లకు కొత్త సామగ్రిని ప్రభుత్వం సరఫరా చేసింది. ఐదు లీటర్ల వెట్ గ్రైండర్, పది లీటర్ల సామర్థ్యం కలిగిన పెద్ద ప్రషర్ స్టీల్‌కుక్కర్, ఇడ్లీ పాత్రలు, పెద్ద తపేళాలు, గరిటెలు, గిన్నెలు, సాంబారు బకెట్లు ఇలా మొత్తం 30 రకాల వంట సామగ్రిని ఆయా వసతి గృహాలకు పంపిణీ చేశారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న బ్రాహ్మణ సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

అట్టహాసంగా రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘ ప్రమాణ స్వీకారం

ఏలూరురూరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): అంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఏలూరు అంబికా ఫ్లావర్స్‌లో మంగళవారం అట్టహాసంగా జరిగింది. సమాఖ్య అడ్వైజరీ కమిటీ చైర్మన్‌గా సత్యవాడ దుర్గాప్రసాద్, రాష్ట్ర అధ్యక్షుడిగా కోనూరు సతీష్‌శర్మ, ప్రధాన కార్యదర్శిగా హెచ్.కె.మనోహరరావు, కోశాధికారిగా పులిపాక ప్రసాద్, ఇతర కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. సత్యవాడ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన బ్రాహ్మణ కార్పొరేషన్‌కు రూ.324కోట్లు కేటాయించడం పట్ల హర్షం ప్రకటించారు. ముగ్గురు బ్రాహ్మణులకు పలు కార్పొరేషన్ చైర్మన్‌లుగా అవకాశం కల్పించడం, ప్రభుత్వ సలహాదారుగా చాగంటి కోటేశ్వరరావును నియమించి బ్రాహ్మణుల ఆత్మగౌరవాన్ని పెంచారన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు సతీష్‌శర్మ మాట్లాడుతూ బ్రాహ్మణుల సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి చేస్తామన్నారు. ముఖ్య అతిథిగా ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ దేవాలయాలకు దీపధూప నైవేద్యాలు అందిస్తూ బ్రాహ్మణుల సంక్షేమానికి సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ, కో-ఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు పాల్గొన్నారు. అనంతరం సమాఖ్య ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాలను ప్రదానం చేశారు.

రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడిగా కామేశ్

తణుకు : బ్రాహ్మణ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడిగా ప్రముఖ న్యాయవాది, తణుకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూరంపూడి కామేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం ఏలూరులో కమిటీ సభ్యులతో కలిసి ప్రమాణ స్వీకారం చేశారు.

ఏలూరులో నిషేధిత సిగరెట్ల స్వాధీనం

ఏలూరు క్రైం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిషేధించిన సిగరెట్లను ఏలూరు నగరంలో కొంతమంది విక్రయిస్తున్నారనే సమాచారం రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారి వి.శ్రీరాంబాబుకు చేరింది. ఈమేరకు మంగళవారం రాత్రి ఏలూరులోని సిగరెట్లు, గుట్కా, పాన్‌మషాలా షాపుల్లో విజిలెన్సు, పోలీసు, రెవెన్యూ, జీఎస్టీ, తూనికలు కొలతల అధికారులు తనిఖీలు చేశారు. ఉప్పాల రమేష్ అనే వ్యక్తి ఎటువంటి పేరులేని షాపును నిర్వహిస్తున్నాడు. అతడి వద్ద ఒక లక్షా 7 వేల వంద రూపాయలు విలువ కల్గిన నిషేధిత సిగరెట్లు, ఒక లక్షా 94 వేల 340 రూపాయలు విలువ కల్గిన గుట్కా, పాన్‌మషాల ప్యాకెట్లను సీజ్ చేశారు. శ్రీలక్ష్మీ ప్రసన్న జనరల్ షాపును తనిఖీ చేసి రూ.20,100 విలువైన నిషేధిత సిగరెట్లను గుర్తించారు. ఈ రెండు షాపులపై ఏడు కేసులు నమోదు చేశారు. దాడుల్లో విజిలెన్సు డీఎస్పీ సింగులూరి వెంకటేశ్వరరావు, విజిలెన్స్ సీఐ బి.ప్రసాద్‌కుమార్, విజిలెన్స్ ఎస్ఐ కె.సీతారామ్, ఎస్ఐ కె.నాగరాజు, తూనికలు, కొలతల అధికారి వి.ప్రశాంత్‌కుమార్, జీఎస్టీ అధికారి షబ్బీర్, వన్‌టౌన్ ఎస్ఐ బాషా, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



ఏలూరు షాపులో నిషేధిత సిగరెట్లను తనిఖీలు చేస్తున్న విజిలెన్సు అధికారులు





కాళ్ల హెచ్‌పీ పెట్రోల్ బంకులో తనిఖీలు చేస్తున్న అధికారులు

కాళ్ల పెట్రోల్ బంక్‌లో అధికారుల తనిఖీలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కాళ్ళ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : కాళ్ల గ్రామంలోని హెచ్‌పీ పెట్రోల్ బంకులో జిల్లా అధికారులు మంగళవారం తనిఖీలు చేశారు. 'అర లీటరు పెట్రోలు రూ.100/-' శీర్షికన సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. ఈ మేరకు లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ వీవీ నాగరాజారావు, ఏఎస్‌వో ఎం.రవిశంకర్ స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి బంక్‌లోని రికార్డులను, పెట్రోల్ నాణ్యత తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెచ్‌పీ బంకులో రికార్డులతోపాటు అన్ని అంశాలను పరిశీలించామని తెలిపారు. ఈ నివేదికను జిల్లా అధికారులకు అందజేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ లక్ష్మీకిరణ్, వీఆర్వో శివనాగరాజు ఉన్నారు.

నేటి నుంచి భీమవరంలో జాతీయస్థాయి నాటిక పోటీలు

భీమవరం అర్బన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : భీమవరంలో బుధవారం నుంచి మూడు రోజుల పాటు కళారంజని 14వ వార్షికోత్సవ జాతీయస్థాయి నాటికల పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. భీమవరంలోని సోమేశ్వర, జనార్దనస్వామి ఆలయ ప్రాంగణంలో నాటిక పోటీలు బుధవారం సాయంత్రం నుంచి ప్రారంభకానున్నాయి. మొదటి రోజు 16వ తేదీన బీవీకే క్రియేషన్స్ కాకినాడ వారి 'తితిక్ష' నాటిక, శ్రీకృష్ణ తెలుగు థియేటర్ ఆర్ట్స్ విజయవాడ వారి 'అనస్వరం' నాటికలు ప్రదర్శించనున్నారు. ప్రారంభం రోజు, ఆఖరి రోజున నాటక రంగంలో విశేషంగా కృషి చేసిన ప్రముఖులను సత్కరిస్తామన్నారు. చివరి రోజు 18న నాటిక పోటీలలో గెలుపొందిన వారికి బహుమతి ప్రదానం ఉంటుందన్నారు. ఈ నాటిక పోటీలను ప్రజలందరూ వచ్చి తిలగించాలని నిర్వాహకులు కోరారు.

పురుషుల క్రికెట్ ఎంపిక పోటీలు వాయిదా

ఏలూరురూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ఉభయ పశ్చిమ గోదావరి జిల్లాల క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏలూరు ఆశ్రం కళాశాల మైదానంలో నిర్వహించాల్సిన పురుషుల క్రికెట్ ఎంపిక పోటీలు అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్టు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జి.ఆదిత్యవర్మ, వి.వి.ఎస్.ఎం. శ్రీనివాసరాజు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 17,18 తేదీల్లో నిర్వహించాల్సిన అండర్-23, అండర్-19 క్రికెట్ ఎంపిక పోటీలు మళ్లీ నిర్వహించే తేదీని త్వరలో ప్రకటిస్తామని వారు తెలిపారు.

డాక్టర్ అంబేడ్కర్‌ను అవమానించిన ఇద్దరి అరెస్ట్

భీమడోలు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : భీమడోలు మండలం పోలసానపల్లి ఎస్సీ కాలనీలో నిర్మాణంలో ఉన్న డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసిన ఘటన నేపథ్యంలో ఇద్దరిని అరెస్ట్ చేశామని భీమడోలు ఎస్ఐ సుధాకర్ మంగళవారం తెలిపారు. పోలసానిపల్లిలో ఈనెల 12వ తేదీన గుర్తుతెలియని వ్యక్తులు అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసిన ఘటన విధితమే. ఈ మేరకు గ్రామానికి చెందిన ఉండి సాయివీరాస్వామి అతడి తండ్రి ఉండి రాంబాబులను ముద్దాయిలుగా గుర్తించి అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

విశాఖలో ముక్కామల యువకుడి మృతి

హాస్టల్ మేడపై నుంచి సెల్‌ఫోన్ మాట్లాడుతూ కిందపడిన వైనం

భీమునిపట్నం (రూరల్), (విశాఖపట్నం) ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): హాస్టల్ మేడపై ఫోన్ మాట్లాడుతూ అదుపుతప్పి కిందపడి ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన విశాఖపట్నం జిల్లా భీమునిపట్నం మండలంలోని చిప్పాడ దివీస్ కర్మాగారంలో మంగళవారం తెల్లవారుజామున జరిగింది. వివరాలివి.. తూర్పుగోదావరి జిల్లా ముక్కామల గ్రామానికి చెందిన వేండ్ర మధుమోహన్ (24) చిప్పాడలోని దివీస్ కర్మాగారంలో ఫోర్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి విధులు ముగించుకుని కర్మాగారం హాస్టల్‌లోని తన గదికి వచ్చాడు. అనంతరం ఫోన్‌లో మాట్లాడుతూ మేడపైకి చేరుకున్నాడు. అక్కడి నుంచి తెల్లవారుజామున రెండు గంటల సమయంలో అదుపుతప్పి జారి పడిపోయాడు. సహచరులు గుర్తించి తీవ్రంగా గాయపడిన అతడిని స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. మృతుడి తండ్రి మురళీమోహన్‌కు సమాచారం ఇచ్చి, సీఐ తిరుమలరావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

హలో.. వినిపిస్తోందా?



ఫోన్ మాట్లాడుతూ డ్రైవ్ చేస్తే ప్రాణాలకు ముప్పు

ఇటీవల కాలంలో ప్రతి ఒక్కరికి సెల్‌ఫోన్ సర్వసాధారణమైంది. మారుతున్న సమాజానికి అనుగుణంగా సాంకేతిక అభివృద్ధి మంచిదైనప్పటికీ దానిని సద్వినియోగం చేసుకుంటే అందరికీ మంచిదే.. కానీ జాగ్రత్తలు పాటించక పోవడంతో ప్రాణాలకు ముప్పు తెస్తున్నాయి. ఇటీవల ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికి సెల్‌ఫోన్ ఒక నిత్యావసర వస్తువుగా మారింది. అయితే కొంతమంది ద్విచక్ర వాహనదారులు, కార్లలో వెళ్లేటప్పుడు ఫోన్‌లు మాట్లాడుతూ డ్రైవ్ చేయడంతో దృష్టి మరలి ప్రమాదాల బారినపడి భారీ మూల్యం చెల్లించుకుంటున్నారు. వాహనాలపై వెళ్లేటప్పుడు చెవుల పక్కన ఫోన్లు పెట్టుకుని వేగంగా వెళుతూ ఎదురుగా వస్తున్న వాహనాలను పసిగట్టకుండా ఢీకొనడంతో చాలా మంది మృత్యువాతపడుతున్నారు. అటువంటి ప్రమాదాలు ఉమ్మడి పశ్చిమ జిల్లాలో చాలా చోట్ల జరిగాయి.

- భీమవరం క్రైం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి)

ఇటీవల చాలామంది సెల్‌ఫోన్ మాట్లాడు తూ డ్రైవింగ్ చేస్తున్నారు. పల్లెల్లోనే కాకుండా పట్టణాల్లోను, హైవే రోడ్లపై సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ పోలీసులు ఉన్న నేపథ్యంలో వారికి దొరకకుండా వెళ్లేందుకు స్పీడ్‌గా వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడుతున్నారు. అటువంటి ప్రమాదాలు చాలానే ఉన్నాయి. పోలీసులు అనేక రకాలుగా సెల్‌ఫోన్ డ్రైవింగ్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్నా ఎవరూ పట్టనట్లు వ్యవహరించడం దారుణం. కుటుంబ పెద్ద రోడ్డు ప్రమాదంలో చనిపోతే ఆయా కుటుంబాల పరిస్థితి ఏమిటనేది ఆలోచించుకోవాలంటూ ప్రసార మాధ్యమాలతోపాటు పత్రికలు, కరపత్రాల్లో తెలియజేస్తూనే ఉన్నారు. కానీ ఎవరిలోనూ నిర్లక్ష్య ధోరణి తగ్గడం లేదు. జిల్లాలో 2024 జనవరి నుంచి ఇప్పటివరకు సెల్‌ఫోన్ డ్రైవింగ్ వల్ల సుమారు 50 మంది వరకు ప్రమాదాల బారినపడి గాయాల పాలవ్వడమే కాకుండా కొంతమంది మృత్యువాత పడ్డారు.

జరిమానా ఇలా..

గతంలో సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తే వెయ్యి రూపాయలు జరిమానా విధించేవారు. కొత్తగా వచ్చిన ప్రభుత్వం జరిమానా పెంచడం వల్ల ప్రమాదాలు అరికట్ట వచ్చనే అంచనాతో భారీగా పెంచింది. సెల్‌ఫోన్ డ్రైవింగ్‌కు, ప్రమాదకర డ్రైవింగ్‌కు రూ.1500 నుంచి రూ.10వేల వరకు జరిమానా విధించాలని జీవో తీసుకువచ్చారు. ప్రజల్లో వ్యతిరేకత రావడంతో ప్రస్తుతం ఆ నిబంధనలను అమల్లోకి తీసుకురావడానికి ప్రభుత్వం సంశయిస్తున్నట్టుగా తెలుస్తుంది. త్వరలోనే కొత్త నిబంధనలు వస్తాయని పోలీసులు సూచిస్తున్నారు.

బాల్యంలోనూ సెల్‌ఫోన్లే..

ఐదో తరగతి చదువుతున్న పిల్లవాడి దగ్గర నుంచి ఇంటర్, డిగ్రీ పిల్లలకు కూడా పెద్దలు సెల్‌ఫోన్లు కొని ఇచ్చేయడంతో పరిస్థితులు దారుణంగా తయారయ్యాయి. చిన్నారులు వాహనాలు నడుపుతూ సెల్‌ఫోన్‌లో మాట్లాడడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. వారికి డ్రైవింగ్ లైసెన్స్ లేకపోయినా భారీ వాహనాలు అధిక ధరలతో కొనుగోలు చేసి తల్లిదండ్రులు వారికి ఇస్తున్నారు. సెల్‌ఫోన్లు, వాహనాలు ఇవ్వడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిసినప్పటికీ ఎవరిలోనూ మార్పు రావడం లేదు. ఇప్పటికైనా సెల్‌ఫోన్ డ్రైవింగ్ వల్ల జరిగే అనర్థాలను తెలుసుకుని ప్రమాదాలు అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పోలీసులు శాఖ వారు సూచిస్తున్నారు.

» రోడ్డు ప్రమాదాల్లో వాహనదారుల మృత్యువాత.. నిబంధనలు పట్టించుకోని వైనం



జరిమానా విధిస్తున్నా తీరు మారడం లేదు

సెల్‌ఫోన్ డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం వల్ల జరిగే ప్రమాదాలను వివరిస్తూ భారీగా జరిమానాలు విధిస్తున్నా చాలామందిలో మార్పు రావడం లేదు. సెల్‌ఫోన్‌తో డ్రైవింగ్ చేయడం వల్ల దృష్టి మరలి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రమాదాలతో చాలామంది మృత్యువాతపడుతున్నారు. ఇంటి వద్ద తల్లిదండ్రులు యువతకు వాహనాలు ఇచ్చేముందు జాగ్రత్తలు చెప్పి జరిగే అనర్థాలను వివరిస్తే చాలావరకు ప్రమాదాలను అరికట్టవచ్చు.

- ఆర్‌జీ జయసూర్య
భీమవరం డీఎస్పీ



మెగా డీఎస్సీలో మరో 166 మంజూరు



» మొత్తం 1,201కి పెరిగిన పోస్టుల సంఖ్య
» 'ప్రత్యేక' పోస్టుల ఎంపిక విధి విధానాలపై భిన్నాభిప్రాయాలు

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి) : ప్రత్యేకావసరాలు గల (సీడబ్ల్యూఎస్ఎన్) పిల్లలకు బోధించేందుకు పాఠశాల విద్యాశాఖ కొత్తగా 105 ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ కేడర్లలో ఉపాధ్యాయ (స్పెషల్ ఎడ్యుకేషన్) పోస్టులను ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు మంజూరు చేసింది. ఇప్పటికే ఉమ్మడి జిల్లాకు మంజూరైన 61 స్పెషల్ ఎడ్యుకేషన్ టీచరు పోస్టులతో కలిపితే మొత్తం 166 పోస్టులను మంజూరు చేసినట్టయింది. ఉమ్మడి జిల్లాలో ప్రత్యేకావసరాలు గల పిల్లలు మొత్తం 2,671మంది ఉండగా, పాఠశాలల్లో యూడైస్ డేటా ఆధారంగా ఈ పోస్టులను మంజూరు చేసినట్టు భావిస్తున్నారు. ఇప్పటికే సీడబ్ల్యూఎస్ఎన్ పిల్లలకు బోధించేందుకు మండలానికి రెండుచొప్పున భవిత కేంద్రాలను నిర్వహిస్తున్న విషయం విధితమే. వీటిలో ప్రత్యేకాసరాలు గల పిల్లలకు బోధించేందుకు సమగ్రశిక్ష ప్రాజెక్టులో కాంట్రాక్టు ప్రాతిపదికన నియమితులైన విలీనవిద్య రిసోర్స్ టీచర్లు(ఐఈఆర్టీలు) ఏళ్ల తరబడి పనిచేస్తున్నారు. ఈవిధంగా పనిచేస్తున్న ఐఈఆర్టీల్లో కొందరు 14-20 ఏళ్లుగా బోధించేవారూ ఉన్నారు. వీరంతా తమ ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలంటూ చిరకాలంగా డిమాండ్ చేస్తున్నారు. ఇటువంటి టీచర్లు దేశవ్యాప్తంగా తమ సర్వీసులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తున్న క్రమంలోనే హైకోర్టు, సుప్రీంకోర్టులను ఆశ్రయించారు. సమగ్రశిక్ష ప్రాజెక్టులో పనిచేస్తున్న ఐఈఆర్టీలకు జీతాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో చెల్లిస్తున్నారు. ఈ నేపథ్యంలో కోర్టు ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా సీడబ్ల్యూఎస్ఎన్ పిల్లలకు బోధించే టీచర్ల నియామకాల విషయంలో ప్రభుత్వం సమీక్షించి తాజాగా కొత్తగా స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయ పోస్టులను పాఠశాల విద్యాశాఖలో చేర్చి మంజూరు చేయాలని నిర్ణయించింది.

స్పష్టత కోసం 'భవిత' ఐఈఆర్టీల్లో డైలమా

తాజాగా మంజూరైన స్పెషల్ ఎడ్యుకేషన్ ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ కేడర్ల ఉపాధ్యాయ పోస్టులను భర్తీచేసే విషయమై స్పష్టత రావాల్సి ఉంది. ఇప్పటికే జిల్లాల్లో మిగులు (సర్‌ప్లస్)గా వున్న టీచరు పోస్టులను స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయ పోస్టులుగా కన్వర్షన్ చేసి భర్తీ చేస్తారని సంకేతాలు అందుతున్నాయి. ఉమ్మడి జిల్లాకు సంబంధించి సర్‌ప్లస్ టీచరు పోస్టులుగా గుర్తించిన వేకెన్సీలను మూడేళ్ల క్రితమే కర్నూలు, తదితర జిల్లాలకు సర్దుబాటు చేసేశారు. ఇక గతేడాది సర్‌ప్లస్‌గా గుర్తించిన ఉపాధ్యాయులను పాఠశాలల వారీగా రేషనలైజేషన్ చేసి కొరతవున్న పాఠశాలలకు సర్దుబాటు చేశారు. కొద్దిరోజుల్లో ముగియనున్న ప్రస్తుత విద్యా సంవత్సరం చివరి రోజున ఆయా పాఠశాలల్లో డిప్యూటేషన్లపై పనిచేస్తున్న సర్‌ప్లస్ టీచర్లందరూ వారివారి పూర్వపు స్థానాలకు వచ్చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో తాజాగా మంజూరు చేసిన స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయ పోస్టుల భర్తీకోసం భౌతికంగా ఆయా పోస్టుల్లో పనిచేస్తున్న టీచర్లను సర్‌ప్లస్‌గా చూపించడానికిగాని, ఆ మేరకు పోస్టులను కన్వర్షన్ చేయడానికి అవకాశం లేదు. మరోవైపు భవిత కేంద్రాల్లో ప్రస్తుతం పనిచేస్తున్న ఐఈఆర్టీలకు తాజా నియామకాల్లో సర్వీసు వెయిటేజీ ఉంటుందా? లేక కొత్తగా నియామకాలు చేపడతారా? అనే విషయంపై సందిగ్ధత నెలకొంది. ఈ పరిస్థితుల్లో ఉమ్మడి జిల్లాకు మంజూరైన స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయ పోస్టులను భవిష్యత్తులో రిటైర్మెంట్లద్వారా ఏర్పడే వెకెన్సీల నుంచి కన్వర్షన్ చేసి భర్తీచేసే అవకాశాలున్నట్టు భావిస్తున్నామని విద్యాశాఖవర్గాలు వివరించాయి. తాజాగా మంజూరైన స్పెషల్ ఎడ్యుకేషన్ టీచరు పోస్టులను మెగా డీఎస్సీ-2025 రిక్రూట్‌మెంట్‌లో చేర్చడానికి ప్రభుత్వం నిర్ణయించినట్టయితే ఉమ్మడి జిల్లాలో నోటిఫై చేయతలపెట్టిన 1,035 ఉపాధ్యాయ నియామకాలకు మరో 166 పోస్టులు కలిపి మొత్తం 1,201 వెకెన్సీలకు నోటిఫికేషన్ జారీచేసే అవకాశం ఉంది. ఈ భర్తీప్రక్రియపై అధికారిక ప్రకటనేదీ లేదు.

క్రైమ్ కార్నర్

గుర్తు తెలియని యువకుడి ఆత్మహత్య



యువకుడి మృతదేహం

ఏలూరు క్రైం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ఓ గుర్తు తెలియని యువకుడు ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని పొట్టిపాడు రైల్వే గేటు దగ్గరలో రైలు పట్టాలపై తలపెట్టి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సమాచారం ఏలూరు రైల్వే ఎస్ఐ పి.సైమన్‌కు అందడంతో తన సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడు సుమారు 20 నుంచి 30 ఏళ్ల వయస్సు కల్గి 5.5 అడుగుల ఎత్తుకల్గి, సిమెంటు రంగు నిలువు చారలు గల తెలుపు పొడవు చేతుల చొక్కా, నీలం, నలుపు రంగు షార్ట్, సిమెంటు రంగు టీ షర్టు ధరించి ఉన్నాడు. యువకుడు వివేక్ ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు ఏలూరు రైల్వే ఎస్ఐ సైమన్ 99892 19559కు సమాచారం అందించాలని రైల్వే పోలీసులు కోరారు.



పూర్తిగా దగ్ధమైన ఇల్లు

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

ఆగిరిపల్లి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): వట్టిగుడిపాడు గ్రామంలోని దళితవాడలో సోమవారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో రేకుల షెడ్డు పూర్తిగా దగ్ధమైంది. బాధితుల కథనం ప్రకారం యలమర్తి సుగుణమ్మ, తన భర్తతో కలిసి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. కుటుంబ సభ్యులు ఇంటి బయట పనులు చేస్తుండగా షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించి ఇల్లు మొత్తం కాలిపోయింది. ఇంట్లోని సామగ్రి కాలిపోవడంతో నిరాశ్రయులయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ అధికారులు వచ్చి మంటలు అదుపుచేశారు. సుమారు ఐదు లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు.

ఆటో బోల్తా.. ఐదుగురికి గాయాలు

బుట్టాయగూడెం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఆటో తిరగబడి ఐదుగురు వ్యక్తులు గాయపడిన ఘటన మంగళవారం బుట్టాయగూడెంలో జరిగింది. జంగారెడ్డిగూడెం నుంచి దొరమామిడికి ప్రయాణికులతో వెళుతున్న ఆటో బుట్టాయగూడెం రంగనాయకమ్మ కాలనీ వద్ద అదుపుతప్పి రోడ్డుపక్కన ఉన్న చెట్టును ఢీకొని తిరగబడింది. ప్రమాద సమయంలో ఆటోలో ఏడుగురు ప్రయాణికులు ఉండగా ఐదుగురు గాయపడ్డారు. వీరిలో ఆరేళ్ల బాలుడు ఉన్నాడు. క్షతగాత్రులను మరో ఆటోలో స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా వైద్యాధికారి బి.వసుంధర ప్రాథమిక వైద్యం అందించారు. ప్రమాదంలో వి.వెంకటేష్, పి.శ్రీకన్య, పి.వెంకాయమ్మ, జి.రమ్య, ఆర్.వినయ్‌కుమార్ గాయపడ్డారు. వెంకటేశ్ కుడిచేతి రెండు వేళ్లు తెగాయని, వెంకాయమ్మ చేతికి గాయం కావడంతో మెరుగైన వైద్యం కోసం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలిస్తున్నట్టు తెలిపారు. మిగిలినవారికి వైద్యసేవలు అందించి ఆసుపత్రిలోనే ఉంచామన్నారు. అందరి ఆరోగ్య పరిస్థితి బాగానే ఉన్నట్టు తెలిపారు.





గాయపడి చికిత్స పొందుతున్న పి.వెంకాయమ్మ వి.వెంకటేష్

'జగనన్న సైన్యం' ఫేస్‌బుక్ పేరుతో దుర్భాషలు

» ఆపై రూ.30 వేలు డిమాండ్ » బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి : 'జగనన్న సైన్యం'అనే ఫేస్‌బుక్ అకౌంట్‌తో మెసెంజర్ ద్వారా అసత్య ఆరోపణలు, దుర్భాషలతో పోస్టులు పెడున్నాడని ఓ మీడియా చానల్ రిపోర్టర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎస్‌కే జబీర్ మంగళవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలివి.. ఓ మీడియా చానల్ రిపోర్టర్ మైరెడ్డి పవన్ చంద్రశేఖర్‌పై ఫిబ్రవరి 24 నుంచి ఏప్రిల్ 12 వరకు సోషల్ మీడియాలో గుర్తుతెలియని ఓ వ్యక్తి పవన్‌పై పోస్టులు పెడుతున్నాడని, ఎందుకు పెడుతున్నావని అతడు ప్రశ్నించగా రూ.30 వేల నగదు ఇస్తే పోస్టులన్నీ డిలీట్ చేస్తానని, లేదంటే మరింత అసభ్యకరంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి పరువు తీస్తానని మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. ఈ మేరకు బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

చెల్లని చెక్కు కేసులో జైలు శిక్ష

నూజివీడు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి) : చెల్లని చెక్కు కేసులో ఒకరికి ఆరునెలలు జైలు శిక్ష, నాలుగు లక్షల రూపాయల జరిమానా విధిస్తూ నూజివీడు ప్రత్యేక న్యాయమూర్తి వేల్పుల కృష్ణమూర్తి మంగళవారం తీర్పుచెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం నూజివీడుకు చెందిన ఎం.మురళీకృష్ణ నుంచి మహ్మద్ రెహమాన్‌కు మూడు లక్షల రూపాయల నగదును అప్పుగా తీసుకున్నారు. బాకీ తీర్మానం నిమిత్తం జూలై 7, 2021లో చెక్కు ఇవ్వగా బ్యాంకులో నగదు లేదని తిరిగి వచ్చింది. బాధితుడు మురళీకృష్ణ న్యాయస్థానాన్ని ఆశ్రయించగా కేసును విచారించిన న్యాయమూర్తి నిందితుడు మహ్మద్ రెహమాన్‌కు ఆరు నెలలు జైలు శిక్ష, నాలుగు లక్షల రూపాయలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

డ్యూటీకి వెళ్లి వచ్చేసరికి ఇంటిని దోచేశారు

ఐదు కాసుల బంగారు ఆభరణాల అపహరణ

జంగారెడ్డిగూడెం,ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని నివాసం ఉంటున్న ఓ మహిళ తన ఇంట్లోని ఐదు కాసుల బంగారు ఆభరణాలు అపహరించారని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎస్‌కే జబీర్ తెలిపారు. వివరాలివి.. పట్టణంలోని గుండాబత్తుల వారి వీధిలో నివాసం ఉంటున్న బుంగా ఝాన్సీరాణి మెడికల్ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తారు. ఆమె ఈనెల 14వ తేదీ ఉదయం ఇంటికి తాళం వేసి డ్యూటీకి వెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. బీరువాలోని రెండు కాసుల బంగారు నల్లపూసల తాడు, మూడు కాసుల బరువున్న నాలుగు జతల చెవిదిద్దులు గుర్తుతెలియని వ్యక్తులు తస్కరించారని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.


రేపు ఏలూరులో జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

ఏలూరుసిటీ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రజా పరిషత్‌కు సంబంధించి ఒకటి నుంచి ఏడు వరకు స్థాయీ సంఘ సమావేశాలు ఈనెల 17న ఉదయం పది గంటల నుంచి ఏలూరులోని జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తామని జిల్లా ప్రజా పరిషత్ సీఈవో కె.భీమేశ్వర్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అనంతరం మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుందన్నారు. ఈ సమావేశాలు జిల్లా ప్రజాపరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధ్యక్షతన జరుగుతాయన్నారు.

దామరచర్లలో కొనసాగుతోన్న పోలీస్ పికెట్

కుక్కునూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): దామరచర్ల గ్రామంలో పోలీస్ పికెట్ కొనసాగుతోంది. రెండు సామాజిక వర్గాల వారు పరస్పరం కొట్టుకున్న విషయం విధితమే. ఈ క్రమంలో నలుగురు తీవ్రంగా గాయపడి భద్రాచలంలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనలో ఇప్పటికే 28మందిపై కేసులు నమోదయ్యాయి. పలువురు భయంతో గ్రామాన్ని విడిచివెళ్ళినట్టు ప్రచారం జరుగుతుంది. కుక్కునూరు సీఐ రమేశ్‌బాబు, ఎస్ఐ రామకృష్ణ, గ్రామంలో పర్యవేక్షిస్తున్నారు. మరికొన్నిరోజుల పాటు గ్రామంలో పోలీస్ పికెట్ కొనసాగనుంది.

98 డీఎస్సీ టీచర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారాయుడు మృతి



సుబ్బారాయుడు (ఫైల్)

పాలకొల్లు అర్బన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ టీచర్ల అసోసియేషన్ అధ్యక్షుడు యర్రంశెట్టి సుబ్బారాయుడు(60) మంగళవారం ఉదయం అస్వస్థతకు గురై మరణించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సుమారు 18 ఏళ్లుగా 98డీఎస్సీ క్వాలిఫైడ్ టీచర్ల సమస్యలపై అలుపెరుగని పోరాటం చేసి ఉద్యోగంలో చేరారు. చివరివరకు సంఘ సభ్యుల అభ్యున్నతికై పాటు పడ్డారు. ఆయన మరణం పట్ల మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, సంఘ సభ్యులు, మిత్రులు యడ్ల మురళీకృష్ణ, మండెల ఫణి, విన్నకోట వెంకటరమణ, బోణం నాగబాబు, జి.వీరాస్వామి, గంగాధరశర్మ, పలువురు ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు.

చింతలపూడిలో నేడు జాబ్‌మేళా

చింతలపూడి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పి.శ్రీనివాసరావు తెలిపారు. నిరుద్యోగ యువత పది నుంచి పీజీ వరకు చదివిన అభ్యర్థులు ఈ జాబ్‌మేళాలో పాల్గొనవచ్చని, రాష్ట్రంలోని 15 కంపెనీలు ఈ మేళాలో పాల్గొంటాయని, ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు.ఈ మేళాలో రెండు తెలుగు రాష్ట్రాల్లోని అభ్యర్థులు పాల్గొనవచ్చని తెలిపారు.

లింగపాలెంలో నేడు ప్రజలతో ఎమ్మెల్యే

లింగపాలెం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగనవసరం లేకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందాలనే ఉద్దేశంతో లింగపాలెం మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ ఆధ్వర్యంలో ప్రజలతో ఎమ్మెల్యే కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కె.వాణి తెలిపారు. అర్హులు ఎవరి చుట్టూ తిరగకుండా సంక్షేమ పథకాలు అందుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీవో పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోళ్ల నిబంధనలపై అవగాహన

కామవరపుకోట, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి) :రావికంపాడులో త్వరలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తామని తహసీల్దార్ గెడ్డం ఎలీషా, మండల వ్యవసాయశాఖాధికారి డాక్టర్ సి.పవన్ కుమార్ తెలిపారు. ఈ మేరకు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ధాన్యం కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చేటప్పుడు పాటించాల్సిన నిబంధనలపై అవగాహన కల్పించారు. కనీస మద్దతు ధర క్వింటాలుకు కామన్ రకం రూ.2,300, గ్రేడ్-ఎ రకం రూ.2,320 మద్దతు ధరను ప్రభుత్వం ఇస్తుందన్నారు. కొనుగోలు కేంద్రానికి ధాన్యం అందిన 24 గంటల్లోనే రైతుల ఖాతాకు నగదు జమ చేస్తామని చెప్పారు. అలాగే రైతులు ఈ-పంటలో తప్పనిసరిగా పేరు నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ పరిపాలనాధికారి ముళ్లపూడి ప్రవల్లిక, గ్రామ సర్పంచ్ వేముల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆప్కాస్ విధి విధానాలు ప్రకటించాలి : ఏఐటీయూసీ

ఏలూరు కార్పొరేషన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి) : ఆప్కాస్‌పై ప్రభుత్వం తక్షణం తమ విధి విధానాలు ప్రకటించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాసడాంగే, ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ ఏలూరు జిల్లా కార్యదర్శి భజంత్రి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ ఏలూరు నగర సమితి ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని ఎలగాడ శివకుమార్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాంగే, శ్రీనివాసరావులు మాట్లాడుతూ కొన్ని నెలల క్రితం ఆప్కాస్ రద్దు చేస్తున్నట్టు రాష్ట్ర మంత్రివర్గం ప్రకటించడంతో ఇటీవల విజయవాడలో మునిసిపల్ కార్మికులు మహాధర్నా నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ తరుణంలో రాష్ట్ర అసెంబ్లీ సమావేశంలో ఆప్కాస్‌పై ప్రభుత్వం మంత్రివర్గ ఉప సంఘాన్ని నియమించిందని, ఈ నివేదిక రాకముందే ఆప్కాస్ రద్దవుతున్నట్టు వదంతులు వినిపిస్తున్నాయన్నారు. ప్రభుత్వం ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ సమస్యలపై చర్చించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో మళ్లీ ఉద్యమిస్తామన్నారు. సమావేశంలో యూనియన్ నాయకులు ఇంటి అశోక్, కాకాని సుబ్బారావు, ఎ.ప్రసాద్, పెడారి వంశీ, అల్లం పెద్దిరాజు, పొన్నాడ మల్లేశ్వరరావు, మాడుగుల జగదీష్, అంతరాజ్ లీల పాల్గొన్నారు.

20న ఏలూరులో కళా ఉత్సవం

ఏలూరు రూరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి) : సీఎం చంద్రబాబు నాయుడు 75వ పుట్టినరోజును పురస్కరించుకుని ఈనెల 20వ తేదీన ఏలూరు సాహిత్య మండలి ప్రాంగణంలో కళాకారుల కళాఉత్సవం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు దువ్వి రామారావు, నాట్యాచార్య డి.హేమసుందర్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సకల కళాకారుల సంక్షేమ సంఘం, సాహిత్య మండలి సంయుక్త ఆధ్వర్యంలో కూచిపూడి, జానపద నృత్యాలు, బుర్రకథ, హరికథ పౌరాణిక పద్యాలు, కోలాటం, సినీ పాటలు, ఏకపాత్రాభినయం, భజన, వివిధ రకాల కళారూపాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కళాభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

రేపు సీఆర్ఆర్ పీజీ కళాశాలలో క్యాంపస్ ఎంపికలు

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి) : విశాఖ, హైదరాబాద్‌లోని లారస్ ల్యాబ్స్‌లో వివిధ ఉద్యోగ నియామకాలకు ఏలూరు సీఆర్ఆర్ పీజీ కళాశాల సెమినార్ హాల్లో ఈ నెల 17న ఉదయం 9.30 గంటల నుంచి క్యాంపస్ ఎంపికలు నిర్వహిస్తున్నారు. బీఎస్సీ,ఎమ్మెస్సీ, బీఫార్మసీ, ఎం.ఫార్మసీ, ఎలక్ట్రికల్, మెకానికల్ విభాగాల్లో డిప్లమా చేసిన విద్యార్థులు హాజరుకావచ్చని కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. ప్రాసెస్, ఆర్‌అండ్‌డీ, క్వాలిటీ కంట్రోల్, ఫార్ములేషన్ ప్రొడక్షన్, ఏపీఐ ప్రొడక్షన్ విభాగాల్లో ఎంపికలు జరుగుతాయన్నారు. జిల్లాలోని వివిధ కళాశాలల్లో 2024లో ఉత్తీర్ణతపొందినవారు, ప్రస్తుత విద్యా సంవత్సరం(2025)లో ఫైనలియర్ చదువుతున్న వారిలో అర్హతలు, ఆసక్తి ఉన్న విద్యార్థులు సెలక్షన్లకు హాజరుకావచ్చన్నారు. వివరాలకు (91009 34943, 95053 40399, 99517 59789)నెంబర్లలో సంప్రదించాలన్నారు.

సోషల్ మీడియాలో అమరవరం సచివాలయం



అమరవరం సచివాలయం

కుక్కునూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): అమరవరం సచివాలయంలో మధ్యాహ్నం 3.30 గంటలకే సిబ్బంది కార్యాలయం నుంచి వెళ్లిపోవడంతో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. సచివాలయానికి పనుల నిమిత్తం వెళ్లిన కొందరికి సచివాలయ తలుపులు తెరచి అందులో సిబ్బంది ఎవరూ లేకపోవడం చూసి వీడియోలు తీసి సోషల్ మీడియాలో పెట్టారు. దీంతో ఇది సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీనిపై ఎంపీడీవో నరసింహారావును వివరణ కోరగా మనమిత్ర సర్వే నిమిత్తం సచివాలయ ఉద్యోగులు బయటకు వెళ్లినట్టు తెలిపారు.

గిన్నీస్ బుక్ నుంచి మోక్షిత్‌కు ప్రశంసా పత్రం



కుక్కునూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): వెంకటాపురం గ్రామానికి చెందిన శెట్టి మోక్షిత్ రిషి నిహాన్ సంగీతంలో తన ప్రతిభను చాటుకున్నాడు. భద్రా చలంలో ఏడవ తరగతి చదువుతున్న 12 ఏళ్ల రిషి నిహాన్ ఆరునెలల పాటు కీ బోర్డులో మెలకువలు తెలుసుకుని నైపుణ్యం సంపాదించాడు. ఈ క్రమంలో హైదరాబాద్‌లో 18 దేశాల నుంచి సంగీత విద్వాంసులు ఒకేసారి కొన్ని గంటల పాటు మ్యూ జిక్ ప్లే చేశారు. అందులో మోక్షిత్ ఒకరు. దీంతో మోక్షిత్‌కు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు ప్రసంశా పత్రాన్ని అందజేసింది. వెంకటాపురం గ్రామానికి చెందిన శెట్టి గోపి, మేరీ గ్రేస్ దంపతుల చిన్న కుమారుడు మోక్షిత్‌కు సంగీతం పట్ల ఆసక్తి కనబర్చడంతో కీబోర్డులో శిక్షణ ఇప్పించారు.

అదనపు భారం

(ఐదో పేజీ తరువాయి)

వసూలు చేయాలని తలపెట్టారు. చాన్నాళ్లక్రితమే ఈ ప్రతిపాదనకు ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. ఆ వెను వెంటనే అమలులోకి తెచ్చినా వినియోగదారుల నుంచి పెద్దగా స్పందన లేదు. వ్యతిరేకత ఎదురవుతుందేమోనన్న ధోరణిలో కొంత కాలం పాటు ఈ తరహా ప్రస్తావన లేకుండానే జాగ్రత్తపడుతూ వచ్చారు.

ఇప్పుడేం జరుగుతుందంటే..

అదనపు విద్యుత్ లోడు వినియోగిస్తున్న వినియోగదారుల నుంచి చార్జీలు వసూలు చేయాలని తీసుకున్న నిర్ణయంలో భాగంగా వినియోగదారులను అప్రమత్తం చేశారు. ఎవరైతే అదనపు లోడు వినియోగించుకుంటున్నారో వారికి చెల్లింపుల్లో రాయితీలు ప్రకటించారు. ముందుగా దరఖాస్తు చేసుకునేందుకు రూ.50, డిపాజిట్ ఫీజు రూ.200, డవలప్‌మెంట్ చార్జీలు రూ.200 మొత్తం రూ.450 చెల్లించాల్సి ఉంటుంది. 50 శాతం రాయితీ ప్రకారం డవలప్‌మెంట్ చార్జీల కింద అదనపు లోడు కావాలనుకుంటే ఒక కిలోవాట్‌కు రూ.1,250, రెండు కిలోవాట్‌లకు రూ.2,450, మూడో కిలోవాట్‌లకు రూ.3,650 ఈపీడీసీఎల్ సంస్థకు చెల్లించాల్సి ఉంది. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా నాలుగు లేదా ఐదు కిలోవాట్‌ల వినియోగానికి వీలుగా 2,500 దరఖాస్తులు మాత్రమే పంపిణీ సంస్థకు అందాయి. వాస్తవానికి గృహావసర వినియోగదారుల్లో అత్యధికులు అదనపు లోడు పరిధిలోకి వచ్చేవారే. సాధారణంగా గృహావసరాలకు ఒకటి నుంచి మూడు కిలోవాట్స్ లోపే దరఖాస్తులో విద్యుత్ లోడు చూపడంతో అప్పట్లో కొంతలో కొంత చార్జీలు వసూలు చేశారు. కాని ఆ పరిస్థితి మారి గృహవిని యోగంలో ప్రతీ ఇంటికి నాలుగు నుంచి ఐదు కిలోవాట్‌ల మధ్య వాడకం ఉంటోంది.

అదనపు వాత తప్పదా..?

అదనపు లోడు వినియోగించుకుంటున్న వారంతా ఆ మేరకే చార్జీలు చెల్లించాలని పంపిణీ సంస్థ పట్టుపడుతుండడంతో ఈ మేరకు సిబ్బంది వినియోగదారులను అప్రమత్తం చేస్తూ వచ్చారు. కాని ఇప్పటికే విద్యుత్ చార్జీలు పెంచేసి అదనపు భారం మోపి ఇప్పుడు అదనపు లోడు పేరిట చార్జీలు చెల్లించాలనడంపై కొందరు ఆక్షేపిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 4.6 లక్షలకు పైగా గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. అదనపులోడు నిమిత్తం చార్జీలు చెల్లించడానికి వచ్చిన దరఖాస్తులు మాత్రం అత్యల్పం. కేవలం పది శాతం కూడా దరఖాస్తులు రాలేదు. దీనిని గమనించి ప్రస్తుతం రాయితీ అమలులో ఉందని, దీనిని పట్టించుకోకుండా జాప్యం చేస్తే భవిష్యత్‌లో నూరు శాతం మేర అదనపు లోడు చార్జీలు వసూలు చేస్తారంటూ ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో కొంత గందరగోళ పరిస్థితి నెలకొంది.



ఏలూరు, తమ్మిలేరు కాలువల్లో పెరిగిన కిక్కిస, గుర్రపు డెక్క





ప్రక్షాళన చేయండి..

ఏలూరు నడిబొడ్డున ఉన్న రెండు కాల్వల్లో పేరుకున్న తూడు - దోమలతో వేగలేక ప్రజలకు నరకం

ఏలూరుకార్పొరేషన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రమైన ఏలూరులో ఏలూరు కాలువ, తమ్మిలేరు కాలువలు ఎంతో ప్రధానం.. ఈ కాలువల్లో గుర్రపుడెక్క, కిక్కిస అధికంగా పేరుకుపోవడంతో నీటి పారుదలకు విఘాతం ఏర్పడుతోంది. పలు చోట్ల చెట్లు కాలువలకు అడ్డంకిగా ఉన్నాయి. కొద్దిపాటి వర్షానికే నీటిపారుదలకు విఘాతం ఏర్పడుతోంది. వర్షాకాలం రాకముందే ఈ వేసవిలోనే కాలువలో నీటి ప్రవాహాలకు అడ్డుగా ఉన్న చెట్లు, పిచ్చి మొక్కలతో పాటు కిక్కిస, గుర్రపుడెక్కను తొలగించాలంటూ రైతులు వేడుకుంటున్నారు. ఈ రెండు కాలువలు ఏలూరు నగరం నడిబొడ్డున ఉండడంతో దోమలు విజృంభిస్తున్నాయి. ఈ కాలువలకు చేర్చి రోడ్లపైనే చెత్తను వేయడంతో దోమల బెడద ఎక్కువైందంటూ నగర వాసులు ఆరోపిస్తున్నారు. కాలువ గట్లను పటిష్టం చేయడంతో పాటు నీరు నిలిచిపోకుండా పూడిక తొలగిస్తే దోమల బెడద తగ్గుతుందని నగర వాసులు పేర్కొంటున్నారు.

పేదలకు ఆర్థిక సహాయం

జంగారెడ్డిగూడెం,ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం పట్టణంలోని ఎనిమిదో వార్డు ఎస్సీ పేటకు చెందిన ముగ్గురు పేదలకు మమత ఆస్పత్రి యాజమాన్యం ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున రూ.పదిహేను వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేసింది. ఈ కార్యక్రమంలో మమత ఆసుపత్రి సిఈఓ చిన్ని, డాక్టర్ రామాంజనేయ నాయక్, మార్కెటింగ్ సిబ్బంది నరేంద్ర, మేనేజరు శ్రీరామ్, మాజీ జడ్పీటీసీ ముప్పిడి శ్రీనివాస్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ ముప్పిడి అంజి, కౌన్సిలర్ నేకూరి కిశోర్ పాల్గొన్నారు.

'చిన్నారులను బడిలో చేర్పించండి'

భీమడోలు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ బడి పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా తల్లిదండ్రులను బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈవో శ్రీనివాసరావు అన్నారు. పాతూరులోని ఎంపీపీఎస్ పాఠశాలను ఆయన సందర్శించారు.మధ్యాహ్న భోజనం కార్యక్రమాన్ని పరిశీలించారు.అనంతరం బడిపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మండే సుధాకర్, హెచ్‌ఎం నిర్మలా కుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు అమలు చేయాలి

టి.నర్సాపురం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీలు నెరవేర్చడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య ఆరోపించారు. టి.నర్సాపురంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల సమావేశం మంగళవారం జరిగింది. వీరంకి వెంకట్రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు గ్రామీణ ప్రాంతాల్లో 3సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2సెంట్లు ఇచ్చి ఇంటి నిర్మాణానికి 5లక్షలు మంజూరు చేయాలన్నారు. అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందజేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడం ద్వారా గ్రామ స్థాయి నుంచి సీపీఐని బలోపేతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.



పరికరాలను అందజేస్తున్న దాతలు

ప్రభుత్వ ఆసుపత్రికి పరికరాల అందజేత

కొయ్యలగూడెం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): కొయ్యలగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి అల్లూరి సర్వారాయుడు ఫౌండేషన్(నవభారత్ ఆయిల్ కంపెనీ) ఆర్థిక సాయం అందించింది. ఈ మేరకు మంగళవారం హాస్పటల్‌కు రూ.5లక్షల 50వేలు విలువైన వివిధ రకాల పరికరాలను ఆసుపత్రి ఛైర్మన్ ఎంపీపీ గంజిమాల రామారావు ఆధ్వర్యంలో డాక్టర్ తస్లీమకు ఆయిల్ కంపెనీ పీఆర్‌ఓ రాఘవరావు, అసిస్టెంట్ మేనేజర్ సిద్ధార్థ అందజేశారు.

పాఠశాలలకు క్రీడా సామగ్రి అందజేత

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): పి.కన్నాపురం పంచాయతీ పరిధిలోని ఐదు పాఠశాలలకు దాతతణుకు వెంకట పెద్ది సురేశ్ రూ.80 వేల విలువైన క్రీడా పరికరాలను అందజేశారు. పి.కన్నాపురం, దాడవల్లి, శరభాపురం, చిన ఎగ్గేపురం, ఎంపీపీ పాఠశాలలకు, అలాగే పి.కన్నాపురంలోని ఎంపీయూపీ పాఠశాలలకు వీటిని అందజేశారు. ఈసందర్భంగా దాతను సత్కరించారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

ఏలూరు క్రైం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి) : వేసవిలో నిప్పుపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి వి.రామకృష్ణ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా రెండవ రోజు మంగళవారం ఏలూరు పాతబస్టాండ్ వద్ద వాహనదారులు, బాటసారులకు అవగాహన కల్పించారు. వంటలు చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, సిగరెట్లు, చుట్ట, బీడీలను పూర్తిగా ఆర్పివేయాలన్నారు. మార్కెట్లో ఫైర్ అలారమ్, ఫైర్ స్మోక్ డిటెక్టర్లు అందుబాటులో ఉన్నాయని వీటిని ఏర్పాటు చేయడం వల్ల అగ్నిప్రమాదాలను ముందుగానే పసిగట్టి కాపాడుకోవచ్చన్నారు. ఈ మేరకు పాతబస్టాండ్ సెంటర్‌లో సిబ్బంది విన్యాసాలు చేశారు.



ఉపాధ్యాయులతో ఎమ్మెల్సీ గోపి మూర్తి

సమస్యలు పరిష్కరిస్తా: ఎమ్మెల్సీ గోపిమూర్తి

నిడమర్రు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి పేర్కొన్నారు. మంగళవారం నిడమర్రు మండలంలో తోకలపల్లి, నిడమర్రు, పత్తేపురం, పెదనింద్రకొలను ఉన్నత పాఠశాలలను ఎమ్మెల్సీ గోపిమూర్తి సందర్శించి తనను ఎన్నుకున్న ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కూన కమల్ కుమార్, నిడమర్రు మండల కార్యదర్శి షేక్ మౌలాలి, అధ్యక్షులు కె.రమేశ్, కార్యవర్గ సభ్యులు టి.శివన్నారాయణ, టి.శ్రీనివాస్, డి.వి.రమణ, బాజీ షాహిద్ పాల్గొన్నారు.

గిరిజనుల భూ సమస్యలు పరిష్కరించాలి

పోలవరం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి) : పశ్చిమ ఏజన్సీలో భూ సమస్యలను పరిష్కరించాలని, గిరిజన చట్టాలను అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ పశ్చిమ ఏజన్సీలో భూ సమస్యలను పరిష్కరించడంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారన్నారు. 2006 అటవీ హక్కు చట్టం ప్రకారం పోడు భూములు సాగు చేస్తున్న వారికి పట్టాలివ్వాలన్నారు.



ఎంపీకి వినతిపత్రం ఇస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

సమస్యలు పరిష్కరించండి

బుట్టాయగూడెం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి) : విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాజమహేంద్రవరంలోని క్యాంపు కార్యాలయంలో ఎంపీ పురందేశ్వరికి పీడీఎస్‌యూ నాయకులు వినతి పత్రం అందజేశారు. ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలని, సాంఘీక సంక్షేమ హస్టల్ విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని, వసతి గృహాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని తదితర సమస్యలతో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇ.భూషణం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్ర మంలో రాష్ట్ర నాయకులు ఎస్.మహర్షి, బి.వినోద్ పాల్గొన్నారు.

ఏలూరును సారా రహిత జిల్లాగా తీర్చిదిద్దండి



సమీక్షలో మాట్లాడుతున్న శ్రీలత

ఏలూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి) : సారా రహిత జిల్లాగా ఏలూరును నిలిపేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ బి.శ్రీలత సూచించారు. ఏలూరు శ్రీరాంనగర్ జిల్లా కార్యాలయంలో అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు.సారాను జిల్లా నుంచి పారద్రోలడానికి నవోదయం 2.0 కింద చేపడుతున్న గ్రామసభలు, అవగాహన కార్యక్రమాలను నెలాఖరు నాటికి పూర్తి చేయాలని కోరారు. తొలుత పెండింగ్‌లోని కేసులను ఇన్వెస్టిగేషన్ చేసి ఛార్జిషీట్ వేయాలన్నారు.సారా కాస్తున్న వారిపై పీడీ యాక్టు ప్రయోగించి కట్టుదిట్టం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కేవీఎం ప్రభు కుమార్, సూపరింటెండెంట్ ఆనాల ఆవులయ్య, అసిస్టెంట్ సూపరింటెండెట్‌లు అజయ్ కుమార్, పాండు రంగారావు, జిల్లాలోని సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

తాగునీటికి కొరత రానివ్వం

సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును పరిశీలించిన ఎమ్మెల్యే

ఏలూరు టూటౌన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగు నీటి కొరత రాకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే బడేటి చంటి తెలిపారు. నగరానికి నీరందించే దెందులూరు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును మేయర్ నూర్జహాన్‌తో కలిసి ఎమ్మెల్యే చంటి పరిశీలించారు. మరమ్మతుల నిమిత్తం బుధవారం నుంచి కాల్వలు మూసివేస్తామని జలవనరుల శాఖ ప్రకటించిన నేపథ్యంలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును పరిశీలించారు. వేసవిలో రెండు పూటల తాగునీరు అందాలంటే 14 మీటర్ల మేర నీరుండాలని,అయితే ప్రస్తుతం 10.3 మీటర్లు మాత్రమే ఉందన్నారు. నీరు తక్కువగా ఉండటంతో మరో వారం రోజులు కాల్వలను మూసివేయవద్దని ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడిని కోరతామన్నారు. ఏది ఏమైనా ఈ వేసవిలో తాగునీటి కొరత లేకుండా రెండు పూటలా నీరందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.కార్యక్రమంలో నగర కమిషనర్ ఏ.భానుప్రతాప్, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చంటి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోషన్

'గ్రామాల్లో ఆక్వా సాగు చేపట్టాలి'

చింతలపూడి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో రైతులు, మహిళలు, చిన్న కమతాలు ఉన్న వారు ఆర్థికంగా బలోపేతం కావాలంటే ఆక్వాకల్చర్ సాగు ఎంతో దోహద పడుతుందని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. మంగళవారం ప్రగడవరం గ్రామంలోని ఆర్య వైశ్య కల్యాణ మండపంలో జరిగిన సమగ్ర వ్యవసాయం, చేపల పెంపకంపై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలో ఈ పథకంపై ప్రగడవరం గ్రామం పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైందన్నారు. గ్రామంలో అవకాశమున్న అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం చింతలపూడిలో జరిగిన పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోల సమీక్షా సమావేశంలో పాల్గొని నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామాలు శుభ్రంగా ఉండేలా కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. మంచినీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాలుగు మండలాల పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు నాయకులు పాల్గొన్నారు.

కాల్వలు కట్టేస్తారా? పొడిగిస్తారా?

ధవళేశ్వరం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): డెల్టా కాలువలను కట్టేస్తారా ? లేక నీటి విడుదలను పొడిగిస్తారా? అనే అంశంపై సందిగ్ధత నెలకొంది. ఖరీఫ్‌లో నీటి సరఫరా సక్రమంగా జరిగేందుకు, క్లోజర్ పనులకు డెల్టా కాల్వలను బుధవారం నుంచి మూసివేయాలని ఇరిగేషన్ అధికారులు నిర్ణయించారు. శివారు ఆయకట్టు భూములకు ఇంకా నీటి అవసరం ఉండడం, గ్రామాల్లో తాగు నీటి చెరువులు నింపుకోవడం తదితర పనులు పూర్తిస్థాయిలో జరగలేదు. రబీ అవసరాలు తగ్గిన తర్వాత గ్రామాల్లో తాగునీటి చెరువులు నింపుకోవడానికి మరో నాలుగైదు రోజులు నీటిని విడుదల చేస్తారు.

శివారు ఆయకట్టుకు ఇంకా నీరు అవసరం

దీనిపై ఇప్పటివరకూ ఎలాంటి సమాచారం లేదు. దీనిపై సర్కిల్ ఎస్ఈ గోపినాథ్ మాట్లాడుతూ 'డెల్టా కాల్వలను నిర్ణయించిన తేదీ మేరకు బుధవారం నుంచి మూసివేయనున్నాం. కాల్వలకు నీటి విడుదల పొడిగింపునకు ఎటువంటి అభ్యంతరాలు రాలేదు. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు ఇంతవరకు అందలేదు. కాలువలకు నీటి విడుదల నిలుపుదల చేయాలని అధికారులు నిర్ణయించడంతో మూసివేసేందుకు సిబ్బంది సిద్ధంగా ఉండాలి' అని అన్నారు.



టీడీపీ కార్యకర్తలను పరామర్శిస్తున్న చింతమనేని

రెండు కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

దెందులూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి) : చల్లచింతలపూడిలో రెండు కుటుంబాలను ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మంగళవారం పరామర్శించారు. గౌడ వీధికి చెందిన నారగాని రాజారావు కుటుంబ సభ్యులైన వేణుగోపాల స్వామి, వెంకన్న బాబులను, మోదుగుమూడి అంజనేయులు సతీమణి మొదుగుమూడి సామ్రాజ్యం కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి భరోసా కల్పించారు. టీడీపీ గ్రామాధ్యక్షుడు వేమన రాము గౌడ్, పార్టీ సీనియర్ నాయకులు మొదుగుమూడి రాంబాబుతో కలిసి ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పరామర్శించి వారి కుటుంబాలకు తోడుగా ఉంటామని భరోసా ఇచ్చారు. గౌడ సంఘం జిల్లా కార్యదర్శి మొదుగుమూడి పండు, పార్టీ కార్యదర్శి నాగనబోయిన సత్యనారాయణ, మాజీ సర్పంచ్ ముమ్మడి మోహన్‌రావు, టీడీపీ మండలాధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్ పాల్గొన్నారు.



వ్యాను బహూకరించిన దాత సుబ్రహ్మణ్యం

పాఠశాలకు వ్యాను బహూకరణ

దెందులూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి) : బొమ్ములూరులోని దీపక్ నెక్సజన్ కార్యాలయంలో విభిన్న ప్రతిభావంతుల పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం వ్యానును ప్రముఖ వ్యాపారవేత్త అడుసుమిల్లి వెంకట సుబ్రహ్మణ్యం మంగళవారం అందించారు.ఈ కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఛైర్ పర్సన్ అడుసుమిల్లి నిర్మల, కరుణోదయ మానసిక విభిన్న ప్రతిభావంతుల పాఠశాల ఛైర్మన్ డొమినిక్, మానవత స్వచ్ఛంద్ద సేవా సంస్థ డెవలప్మెంట్ కమిటీ ఛైర్మన్ మేతర అజయ్‌బాబు, ఎం.అశోక్ కుమార్ పాల్గొన్నారు.

మంచినీటి బోరుకు శంకుస్థాపన

కామవరపుకోట, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి) : పాతూరు గ్రామంలోని గుడ్ల గవరమ్మ అమ్మవారి ఆలయ సమీపంలో మంచినీటి సౌకర్యార్థం రూ.6.10 లక్షలతో ఏర్పాటు చేయనున్న మంచినీటి బోరు పథకానికి జడ్పీటీసీ కడిమి రమేశ్, సర్పంచ్ కరిపోతు అనూషా భాగ్యరాజ్‌లు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు ఘంటా భాస్కరరావు, యర్రా ఆదినారాయణ, కంచర్ల రాంబాబు, సాయిన కనకరాజు, తమ్మిశెట్టి సుబ్రహ్మణ్యం, ఆరుమళ్ల ధర్మ పాల్గొన్నారు.

ఘనంగా అన్నసమారాధన

ఏలూరు కార్పొరేషన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) :గొల్లాయిగూడెం రాజీవ్ గృహకల్ప కాలనీలో సీతారామ కల్యాణ మహోత్సవం ముగిసిన నేపథ్యంలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అధ్యక్షులు కణితి రాంబాబు ఆధ్వర్యంలో ఘనంగా అన్న సమారాధ నిర్వహించారు. తొలుత సీతారామలక్ష్మణ హనుమంతుల వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించిన అనంతరం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఉపాధి బకాయిలు చెల్లించండి

భీమడోలు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ కార్మికులకు రావాల్సిన రెండు నెలల బకాయిలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లింగరాజు డిమాండ్ చేశారు. నగరంలో జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధి కార్మికులు పనులు చేసి మూడు నెలలు గడుస్తున్నా కూలీలకు సొమ్ము చెల్లించలేదన్నారు. ఉపముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ జోక్యం చేసుకుని కార్మికుల సొమ్ము విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కట్టా భాస్కరరావు, శ్రీనివాసు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ పరీక్షల్లో టాపర్లుగా నిలిచిన స్థానిక సీఆర్ఆర్ కళాశాల విద్యార్థులకు మంగళవారం కళాశాల కరస్పాండెంట్ కలగర శివరామకృష్ణ ప్రసాద్ తన సొంత నిధుల నుంచి నగదు ప్రోత్సాహక బహుమతులు, నోట్ బుక్స్‌తో కూడిన కిట్లను అందజేశారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, అధ్యాపకులు విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ పావని బదిలీ

చింతలపూడి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ మున్సిపల్ కమిషనర్‌గా పని చేస్తున్న డి.పావని అనంతపురం బదిలీ అయ్యారు. జగ్గయ్యపేటలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఎ.రాంబాబును చింతలపూడి నగర పంచాయతీ మునిసిపల్ కమిషనర్ నియమించారు. ఈ మేరకు మున్సిపల్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

రాయితీపై వ్యవసాయ పరికరాలు

పోలవరం ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా మంగళవారం పలువురు రైతులకు 50 శాతం రాయితీపై వ్యవసాయ ఉపకరణాలు అందజేసినట్టు మండల వ్యవసాయశాఖ అధికారి కె.రాంబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్త పట్టిసీమ నీటి సంఘం అధ్యక్షులు వీరపుశెట్టి వెంకటరత్నం, చీకట్ల సాయికృష్ణ, ఎం.సునీల్, టీడీపీ మండలాధ్యక్షులు బొడ్డు కృష్ణ, ఉపాధ్యక్షులు నునకాని రాంబాబు, నాగిరెడ్డి నాగేశ్వరరావు, డోకల నాగేశ్వరరావు, బొరుసు రాంబాబు, వీధి కిషోర్, జనసేన పార్టీ మండల అధ్యక్షులు గునపర్తి చిన్ని పాల్గొన్నారు.

వైసీపీ సోషల్ మీడియాపై ఫైర్

పెదవేగి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి) : వైసీపీ సోషల్ మీడియాపై ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దుగ్గిరాలలో మంగళవారం వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఆయా సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖాధికారులకు ఆదేశాలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంపై సోషల్ మీడియాలో వైసీపీ విష ప్రచారం చేస్తోందన్నారు. వైసీపీ సోషల్ మీడియాపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, మాగంటి నారాయణ ప్రసాద్, ఎం.కనకరాజు పాల్గొన్నారు.

గడ్డిమేటుకు ఆకతాయిల నిప్పు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ఆకతాయిలు నిప్పుపెట్టడంతో పశువుల కోసం నిల్వ ఉంచిన గడ్డిమేటు కాలి బూడిదయింది. ఏలూరు పోణంగి రోడ్డులోని మరడాని రంగారావు కాలనీకి చెందిన మెరుగుమాల రాజేంద్రప్రసాద్ వరి గడ్డిని పశువుల దాణా కోసం మేటుగా పొలంలో వేసి ఉంచారు. గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం మధ్యాహ్నం నిప్పు పెట్టడంతో మంటలు అంటుకున్నాయి. సమాచారమందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెళ్లి మంటలను ఆర్పారు. అయితే ఆ గడ్డి పూర్తిగా కాలిపోయింది. పశువులకు దాణా లేకుండా పోయింది. గతంలో కూడా ఆకతాయిలు ఇదే విధంగా గడ్డిమేట్లకు నిప్పు పెట్టిన సంఘటనలు ఉన్నాయి. పోలీసులు ఇలాంటి ఆకతాయిలపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

లింగపాలెం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): క్రీడలతో ఎంతో మానసిక ఉల్లాసం కలుగుతుందని ప్రతి ఒక్కరూ క్రీడల్లో పాల్గొని ఆరోగ్యంగా జీవించాలని ఎమ్మెల్యే రోషన్ కుమార్ అన్నారు. లింగపాలెం మండలం వేములపల్లిలో జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్‌లో ఎస్ఆర్‌కే టీమ్ తరపున బరిలో దిగి క్రికెట్ ఆడి జట్టును గెలిపించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడలలో రాణించాలని, క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కైకలూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల కోసం బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని గుడివాడ విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరావు తెలిపారు. 132 కేవీ టవర్ లైన్ మరమ్మతుల కారణంగా చిగురుకోట సబ్‌స్టేషన్ పరిధిలోని మండలాలకు బుధ వారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ పుట్టా మహేశ్ కుమార్

కొల్లేరు సమస్య పరిష్కారానికి కృషి

ఎంపీ పుట్టా మహేశ్ కుమార్

కైకలూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): కొల్లేరు సమస్య పరిష్కారానికి చేస్తున్నామని ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ అన్నారు. కైకలూరులో టీడీపీ నియోజకవర్గ సమావేశం మంగళవారం నిర్వహించారు. టీడీపీ సభ్యత్వం తీసుకున్న 63 వేల మందికి గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. కొల్లేరు సమస్య గతంలో ఎవరూ పట్టించుకోకపోవడంతోనే జఠిలమైందని ఒక్కో చిక్కుముడిని విప్పేందుకు న్యాయపోరాటం చేస్తున్నామని, త్వరలోనే సమస్య పరిష్కారమవుతుందన్నారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, తాను సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి సుప్రీంకోర్టులో వాదనలు వినిపించేందుకు ప్రత్యేక లాయర్లను నియమించినట్లు తెలిపారు. పార్లమెంట్ పరిధిలోని 7 నియోజకవర్గాల్లో 5 నియోజకవర్గాల ప్రజలు సమస్యల పరిష్కారం కొరకే కలుస్తున్నారని, కైకలూరు, నూజివీడు నియోజకవర్గాల ప్రజలు రావడం లేదన్నారు. కైకలూరు నియోజకవర్గానికి టీడీపీ ఇన్‌చార్జి కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. ఏలూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ పొత్తుల వలన కొన్ని ఇబ్బందులు ఉన్నప్పటికీ వాటిని సమన్వయం చేసుకుంటూ పనిచేయాలన్నారు. మరో 15 ఏళ్ల టీడీపీ అధికారంలో ఉంటేనే రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపించగలుగుతామన్నారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, రాష్ట్రపార్టీ కార్యదర్శి కొత్త నాగేంద్రకుమార్, నియోజకవర్గ పరిశీలకుడు మెంటే పార్థసారఽథి, నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, కోకన్వీనర్లు కొడాలి వినోద్,బొమ్మనబోయిన విజయలక్ష్మి, తేరా రమేష్‌బాబు, పెన్మెత్స త్రినాధరాజు, చల్లగుళ్ళ శోభనాద్రి చౌదరి, డీసీ చైర్మన్ పొత్తూరి వాసు రాజు, కార్పొరేషన్ డైరెక్టర్లు మాల్యాద్రి, అంద్రాజు శ్రీనివాసరావు, నేతలు వల్లభనేని శ్రీనివాసచౌదరి, పోలవరపు లక్ష్మీరాణి, పూల రామచంద్రరావు, చలసాని జగన్మోహనరావు పాల్గొన్నారు.

పెయ్యేరు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల ప్రవేశాలు



విద్యార్థులను నమోదు చేస్తున్న ఉపాధ్యాయులు

ముదినేపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి విద్యార్థుల ప్రవేశాల ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ పాఠశాలల్లోనే చేరండి అంటూ ఉపాధ్యాయులు కరపత్రాల ద్వారా ప్రచారం చేపట్టిన పరిస్థితుల్లో మంగళవారం ముదినేపల్లి మండలం పెయ్యేరులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 13 మంది విద్యార్థులు 3, 4 తరగతుల్లో చేరారు. గత విద్యాసంవత్సరంలో 2, 3 తరగతులు గ్రామ శివారు రంగాపురం ప్రాథమిక పాఠశాలలో చదివారు. పెయ్యేరు ప్రాథమిక పాఠశాల హెచ్ ఎం బేతాళ రాజేంద్ర ప్రసాద్, ఉపాధ్యాయుడు చక్రధర్ ఈ విద్యార్థులకు తమ పాఠశాలలో ప్రవేశం కల్పించారు. కొత్తగా 13 మంది విద్యార్థుల చేరికతో ఈ పాఠశాల విద్యార్థుల సంఖ్య 41కి చేరింది. ఈ ఏడాది 55 మందికి పైగా విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నది తమ లక్ష్యమని హెచ్‌ఎం తెలిపారు.



లక్ష్మీనరసింహుని ఆలయం



భూమి కేటాయింపును పరిశీలించేందుకు వచ్చిన జేసీ ధాత్రిరెడ్డి (ఫైల్)

సుందరగిరికి మహర్దశ

లక్ష్మీనరసింహుని ఆలయానికి 30 ఎకరాలు కేటాయిస్తూ మంత్రి వర్గం ఆమోదం

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): సుందరగిరిపై కొలువైన లక్ష్మీనరసింహుని ఆలయ అభివృద్ధి కోసం 30 ఎకరాల ప్రభుత్వ భూమిని దేవదాయశాఖకు కేటాయించేందుకు చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో మంగళవారం జరిగిన ఇ-క్యాబినెట్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. మహిమాన్వితమైన ఈ ఆలయం మరింత అభివృద్ధి అవుతుందని పలువురు భక్తులు, స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల మండలంలోని ఐఎస్ రాఘవారం శివారు ఐఎస్ జగన్నాథపురంలోని సర్వే నెంబరు 425/193లోని 30 ఎకరాల భూమిని కేటాయించేందుకు ప్రభుత్వం సంకల్పించింది. జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి ఐఎస్ జగన్నాథపురం గ్రామానికి గతేడాది డిసెంబరు 10న విచ్చేశారు. గ్రామంలో ఈ భూమి ఎక్కడ ఇవ్వాలి అన్న దానిపై ఆమె పరిశీలించారు. అక్కడ గ్రామ రికార్డులు, మేప్‌లను చూశారు.

డీసీఎం పవన్ ప్రత్యేక దృష్టి

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గతేడాది నవంబర్ 1న జగన్నాథపురంలో దీపం-2 పథక ప్రారంభోత్సవానికి వచ్చిన సమయంలో ముందుగా ఆయన ఆలయ యాగశాలకు వెళ్లి అక్కడ సుదర్శన నృశింహ ధన్వంతరి హోమంలో పాల్గొన్నారు. అక్కడి ఆలయ భూముల రక్షణపై ఆరా తీశారు. భూములను అక్రమంగా తవ్వేశారని, అలాగే ఇందులో ఎన్నో అవకతవకలు చోటుచేసుకున్నాయని స్థానికులు కొందరు పవన్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన విచారణ జరిపి వారంలోగా నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వికి ఆదేశించారు. పవన్‌కల్యాణ్ ఆదేశాలతో అధికార యంత్రాంగం ఒక్కసారిగా కదిలింది. జగన్నాథపురంలో కొండ తవ్వకాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.

ఎస్సీ కాలనీలో తాగునీటి సరఫరా పునరుద్ధరణ

ముసునూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): చింతలవలి ఎస్సీ కాలనీకి నీరు అందించే మంచినీటి బోరు మరమ్మతుకు గురికావడంతో కాలనీవాసులు కొన్ని రోజులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సర్పంచ్ పిల్ల సత్యనారాయణ, కార్యాదర్శి నీరజ ఆధ్వర్యంలో విద్యుత్ మోటారును బాగుచేయించి, మంగళవారం నీటి సరఫరాను పునరుద్ధరించారు. బోరు మరమ్మతుకు గురైన నాటి నుంచి మరో రెండు పంచాయతీ బోర్ల నుంచి కాలనీకి కొంతమేర నీటి సరఫరా చేశారు. విద్యుత్ కోతలు, ఓల్టేజ్ సమస్య వల్ల విద్యుత్ మోటార్లు మరమ్మతులకు గురవుతున్నామని ఈ సమస్య రాకుండా ట్రాన్స్‌కో అధికారులు చూడాలని సర్పంచ్ కోరారు.

అదనపు భారం

(ఐదో పేజీ తరువాయి)

వసూలు చేయాలని తలపెట్టారు. చాన్నాళ్ల క్రితమే ఈ ప్రతిపాదనకు ప్రభుత్వం ఆమోద ముద్ర వేసింది. ఆ వెను వెంటనే అమలులోకి తెచ్చినా వినియోగదారుల నుంచి పెద్దగా స్పందన లేదు. వ్యతిరేకత ఎదురవుతుందేమోనన్న ధోరణిలో కొంత కాలం పాటు ఈ తరహా ప్రస్తావన లేకుండానే జాగ్రత్తపడుతూ వచ్చారు.

ఇప్పుడేం జరుగుతుందంటే..

అదనపు విద్యుత్ లోడు వినియోగిస్తున్న వినియోగదారుల నుంచి చార్జీలు వసూలు చేయాలని తీసుకున్న నిర్ణయంలో భాగంగా వినియోగదారులను అప్రమత్తం చేశారు. ఎవరైతే అదనపు లోడు వినియోగించుకుంటున్నారో వారికి చెల్లింపుల్లో రాయితీలు ప్రకటించారు. ముందుగా దరఖాస్తు చేసుకునేందుకు రూ.50, డిపాజిట్ ఫీజు రూ.200, డవలప్‌మెంట్ చార్జీలు రూ.200 మొత్తం రూ.450 చెల్లించాల్సి ఉంటుంది. 50 శాతం రాయితీ ప్రకారం డవలప్ మెంట్ చార్జీల కింద అదనపు లోడు కావాలనుకుంటే ఒక కిలోవాట్‌కు రూ.1,250, రెండు కిలోవాట్‌లకు రూ.2,450, మూడో కిలోవాట్‌లకు రూ.3,650 ఈపీడీసీఎల్ సంస్థకు చెల్లించాల్సి ఉంది. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా నాలుగు లేదా ఐదు కిలోవాట్‌ల వినియోగానికి వీలుగా 2,500 దరఖాస్తులు మాత్రమే పంపిణీ సంస్థకు అందాయి. వాస్తవానికి గృహావసర వినియోగదారుల్లో అత్యధికులు అదనపు లోడు పరిధిలోకి వచ్చేవారే. సాధారణంగా గృహావసరాలకు ఒకటి నుంచి మూడు కిలోవాట్స్ లోపే దరఖాస్తులో విద్యుత్ లోడు చూపడంతో అప్పట్లో కొంతలో కొంత చార్జీలు వసూలు చేశారు. కాని ఆ పరిస్థితి మారి గృహ వినియోగంలో ప్రతీ ఇంటికి నాలుగు నుంచి ఐదు కిలోవాట్‌ల మధ్య వాడకం ఉంటోంది.

అదనపు వాత తప్పదా..?

అదనపు లోడు వినియోగించుకుంటున్న వారంతా ఆ మేరకే చార్జీలు చెల్లించాలని పంపిణీ సంస్థ పట్టుపడుతుండడంతో ఈ మేరకు సిబ్బంది వినియోగదారులను అప్రమత్తం చేస్తూ వచ్చారు. కాని ఇప్పటికే విద్యుత్ చార్జీలు పెంచేసి అదనపు భారం మోపి ఇప్పుడు అదనపు లోడు పేరిట చార్జీలు చెల్లించాలనడంపై కొందరు ఆక్షేపిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 4.6 లక్షలకు పైగా గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. అదనపులోడు నిమిత్తం చార్జీలు చెల్లించడానికి వచ్చిన దరఖాస్తులు మాత్రం అత్యల్పం. కేవలం పది శాతం కూడా దరఖాస్తులు రాలేదు. దీనిని గమనించి ప్రస్తుతం రాయితీ అమలులో ఉందని, దీనిని పట్టించుకోకుండా జాప్యం చేస్తే భవిష్యత్‌లో నూరు శాతం మేర అదనపు లోడు చార్జీలు వసూలు చేస్తారంటూ ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో కొంత గందరగోళ పరిస్థితి నెలకొంది.



మండలంలో చెరువులో వలల ద్వారా రొయ్యలను పట్టుబడి

ఆక్వా ఉక్కిరి బిక్కిరి

అకాల వర్షాలు.. ఉక్కపోత

మండవల్లి ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): వాతావరణ మార్పులతో ఆక్వా రంగం ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఉక్కపోత వాతావరణంలో చెరువుల్లో ఆక్సిజన్ సమస్యతో రైతులు సతమతం అవుతున్నారు. ఉదయం చెరువుల్లో ఆక్సిజన్ సరిపడక ఏరియేటర్ల వినియోగంతో ఖర్చు పెరుగుతోందని రైతులు వాపోతున్నారు. ఈదురుగాలులు వల్ల విద్యుత్ సమస్యతో జనరేటర్ల వినియోగంతో ఆర్థికభారం మరింత పెరిగింది.

విద్యుత్ సరఫరా నిలిచిపోయిన ప్రాంతాల్లో జనరేటర్లను ఏర్పాటు చేయవలసి ఉంది. జనరేటర్ల అద్దె కంటే మరింత ఎక్కువ వసూలు చేస్తున్నారు. గతంలో 30 కేవీ జనరేటర్ రూ.10 వేలు నెల అద్దెకు ఏర్పాటు చేయగా ప్రస్తుతం రైతు అవసరాల్ని అదనుగా చేసుకుని రూ.15 వేలు వసూలు చేశారని పలువురు వాపోతున్నారు. డీజిల్ కోసం ఆక్వా రైతులు పెట్రోలు బంకుల వద్ద క్యూ కట్టారు. రాత్రి సమయాల్లో అన్ని బంకులు తీసి ఉండవు. దీంతో పనిచేసే బంకుల వద్దకు పరుగులు తీస్తున్నారు..

పట్టుబడుల వైపు రైతులు

వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రైతులు పట్టుబడికి మొగ్గు చూపుతున్నారు. ధర లేకపోయినప్పటికీ అయినకాడికి అమ్ముకునేందుకు రైతులు ముందుకు సాగుతున్నారు. అమెరికా ట్యాక్స్ విధానంతో ఆక్వా ఎగుమతి అకస్మాత్తుగా తగ్గించిన ధరలతో రైతులు నష్టపోతున్నప్పటికీ పట్టుబడి చేసేందుకే మక్కువ చూపుతున్నారు.

పన్ను సడలించినా..

మూడు నెలలు పన్ను సడలించినట్లు ప్రకటనలు వెలువడుతన్నప్పటికీ ఆక్వా ఎగుమతిదారులు మాత్రం రొయ్యల ధర పెంపుపై మీన మేషాలు లెక్కిస్తున్నారు. 40 కౌంటు ధర రూ.400 ఉండగా ప్రస్తుతం రూ.340కు కొనుగోలు చేస్తున్నారు. 30 ధర రూ.460 ఉండగా ప్రస్తుతం రూ.415కు కొనుగోలు చేయడంతో రైతులు సతమతమవుతున్నారు. ట్యాక్స్ మినహాయింపు తరుణంలో ప్రభుత్వం జోక్యం చేసుకొని రొయ్యల ధరలను పెంపుదలకు కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.

దాకరం రోడ్డుకు మోక్షం

రూ.16 లక్షలతో రహదారి అభివృద్ధి

ముదినేపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ముదినేపల్లి - భీమవరం జాతీయ రహదారి నుంచి దాకరం మీదుగా పుట్ల చెరువు వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారికి ఎట్టకేలకు మోక్షం కలిగింది. ఏండ్ల తరబడి ఈ రోడ్డు అధ్వానస్థితి వల్ల పలు గ్రామాల ప్రజలు ఎదుర్కొన్న అవస్థలు నేటికి తొలగాయి. దాకరం, నాయుడు చెరువు, పేరూరు, తేరగూడెం తదితర గ్రామాల ప్రజలతో పాటు మండవల్లి మండలంలోని కొన్ని గ్రామాల ప్రజలకు రహదారి సౌకర్యం కల్పిస్తున్న ఈ రహదారికి రూ.16 లక్షల నిధులను కూటమి ప్రభుత్వం మంజూరు చేయడంతో అడుగడుగునా గోతుల గండంగా ఉన్న ఈ రోడ్డు అభివృద్ధి చెందింది.

గ్రామసభలో ఆమోదించిన పనులు ప్రజలకు వివరించాలి

కైకలూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): గతంలో గ్రామసభల్లో ఆమోదించిన పనులు సభకు వివరించాలని ప్రజలు కోరారు. మంగళవారం కైకలూరు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద గ్రామసభను సర్పంచ్ డీఎం నవరత్నకుమారి అధ్యక్షతన నిర్వహించారు. గతంలో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సూచన మేరకు గ్రామసభల్లో ప్రవేశపెట్టిన పనులు తీర్మానాలు ఏ మేరకు జరిగాయో వాటిని ప్రజలకు తెలియజేయాలని కోరారు. గ్రామసభకు వార్డు సభ్యులు కూడా హాజరుకాకపోవడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు. కైకలూరులో సులభ కాంప్లెక్స్ నిర్మాణానికి స్థలాలను సేకరిం చాలని బీజేపీ నాయకుడు కీర్తి వెంకట రాంప్రసాద్ కోరారు. బీజేపీ నాయకులు సమయం ఏసుబాబు, పంచాయతీ కార్యదర్శి ఆనందభూషణం, సిబ్బంది పాల్గొన్నారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

ముదినేపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : స్నేహితులతో కలిసి ఫంక్షన్‌కు వెళ్లిన ఓ యువకుడు ఇంటికి తిరిగి రాని ఉదంతమిది. పోలీసుల కథనం ప్రకారం ముదినేపల్లి మండలం కోమర్రు గ్రామానికి చెందిన పెందుర్తి నాగ వెంకట ఫణీంద్ర (32) ఈనెల 13న పెదపాలపర్రులోని తన స్నేహితులతో కలిసి వేరే చోటికి ఒక ఫంక్షన్‌కు వెళ్తున్నట్లు ఇంటి వద్ద చెప్పి వెళ్లాడు. ఎక్కడికి వెళ్లాడో తెలియదు కాని ఇంతవరకు తిరిగి ఇంటికి రాలేదు. గత రెండు రోజులుగా అతని ఆచూకీ కోసం ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో మంగళవారం అతని భార్య సుధారాణి తన భర్త అదృశ్యంపై ముదినేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి ఎస్‌ఐ వీఎస్ వీరభద్రరావు దర్యాప్తు చేస్తున్నారు.

వక్ఫ్ చట్ట సవరణపై నిరసన

కైకలూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు పూర్తిగా విరుద్ధమైనదని తక్షణమే దానిని నిలుపుదల చేయాలని మంగళవారం కైకలూరులో ముస్లింల నియోజకవర్గ జేఏసీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కైకలూరు షాదీఖానా నుంచి ఏలూరు రోడ్డు సెంటర్ వరకు వేలాదిమంది ముస్లింలు, ప్లకార్డులతో నిరసన తెలిపారు. తాలుకా సెంటర్లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఎండీ జానీ, బాషీద్, రఫీబాషా, షాబుద్దీన్, గఫూర్, షేక్ మూసా, ఎండీ సిరాజ్, ఎండీ ఉస్మాన్, షేక్ సుభానీ, ఖాదర్‌బాషా, రఖీబా, అస్లాం, షేక్ రఫీ, ఎండీ అమీర్, హమీద్, షేక్ సికిందర్, ఎండీ షబ్బీర్, తదితరులు పాల్గొన్నారు.

నీరు మళ్లించకుండా నిఘా

ముదినేపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): తాగునీటి అవసరాలకు పంట కాల్వలకు విడుదల చేయనున్న నీటిని ఇతర అవసరాలకు మళ్లించకుండా అధికారులు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నారు. గుడ్లవల్లేరు లాకుల వద్ద క్యాంప్ బెల్, పోల్‌రాజ్, బంటుమిల్లి ప్రధాన పంటకాల్వలకు, గుడివాడ కెనాల్ ద్వారా లేళ్లపూడి, కోడూరు ఛానళ్లకు మంగళవారం నీరు విడుదల చేయనున్నారు. మంచినీటి చెరువులకు తప్ప చేపలు, రొయ్యల చెరువులకు మళ్లించకుండా ఇరిగేషన్ శాఖ అధికారులు, సిబ్బంది కాల్వల వెంబడి నిఘా విధించేందుకు సిద్ధమవుతున్నారు.

పోషకాహారంతో మంచి ఆరోగ్యం

అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు



పడమటిపాలెం పౌష్టికాహారంపై అవగాహన సదస్సు

కలిదిండి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు కిశోర బాలికలు ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతీ రోజు పౌష్టికాహారం తీసుకోవాలని కోరుకొల్లు సెక్టార్ సూపర్‌వైజర్ ప్రసన్న అన్నారు. పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా పడమటిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆరు నెలల నుంచి మూడు సంవత్సరాలు నిండే వరకు పిల్లలకు ఆకుకూరలు, పాలు, పండ్లను తల్లులు తినిపించాలన్నారు. వ్యాక్సిన్లు వేయించాలన్నారు. చిన్నారులకు పౌష్టికాహారం పెట్టేటప్పుడు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు చేతులు శుభ్రంగా కడుక్కో వాలన్నారు. సర్పంచ్ సానా మీనా సరస్వతీ, కార్యదర్శి నాగరాజు, అంగన్ వాడీ టీచర్ మంగతయారు పాల్గొన్నారు.

నూజివీడులో..

నూజివీడు టౌన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే ఆరోగ్యకర సమాజం ఏర్పడుతుందని నూజివీడు సీడీపీవో కె.ధనలక్ష్మి అన్నారు. నూజివీడు పట్టణంలోని గొడుగువారిగూడెంలో అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార పక్షోత్సవాలను పురస్కరించుకుని అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా పిల్లలు ఆరోగ్యకరంగా ఎదుగుతారన్నారు. రక్తహీనతను పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా నిరోధించవచ్చన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



నూజివీడులో అవగాహన కల్పిస్తున్న సీడీపీవో ధనలక్ష్మి



నూజివీడు బస్టాండ్ సెంటర్లో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది



కైకలూరులో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అగ్నిమాపక శాఖ అధికారులు

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

నూజివీడు టౌన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి) : విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగే అగ్నిప్రమాదాలను నివారించేందుకు చర్యలు చేపట్టాలని నూజివీడు ఫైర్ ఆఫీసర్ డి.ముత్తయ్య సూచించారు. నూజివీడు పట్టణంలో అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా డీమార్ట్, ద్వారకా సెంటర్, ఆర్టీసీ బస్టాండ్ కూడళ్లలో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ షార్ట్ సర్క్యూట్లు జరగకుండా జాగ్రత్తపడాలన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

కైకలూరు : వేసవిలో అగ్నిప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉంటూ ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని కైకలూరు రూరల్ సీఐ రవికుమార్ అన్నారు. మంగళవారం కైకలూరు అగ్నిమాపక శాఖ కార్యాలయంలో వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పలు కూడళ్ళల్లో అగ్నిప్రమాదాల నివారణపై ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. అగ్నిమాపక శాఖ అధికారి క్రాంతికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

చెల్లని చెక్కు కేసులో జైలు

నూజివీడు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి) : చెల్లని చెక్కు కేసులో ఒకరికి ఆరునెలలు జైలు శిక్ష, నాలుగు లక్షల రూపాయల జరిమానా విధిస్తూ నూజివీడు ప్రత్యేక న్యాయమూర్తి వేల్పుల కృష్ణమూర్తి మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం నూజివీడుకు చెందిన ఎం.మురళీకృష్ణ నుంచి మహ్మద్ రెహమాన్‌కు మూడు లక్షల రూపాయల నగదును అప్పుగా తీసుకున్నారు. బాకీ తీర్మానం నిమిత్తం జూలై 7, 2021లో చెక్కు ఇవ్వగా బ్యాంకులో నగదు లేదని తిరిగి వచ్చింది. బాధితుడు మురళీకృష్ణ న్యాయస్థానాన్ని ఆశ్రయించగా కేసును విచారించిన న్యాయమూర్తి నిందితుడు మహ్మద్ రెహమాన్‌కు ఆరు నెలలు జైలు, నాలుగు లక్షల రూపాయలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.



ఇంటిలోపల కాలిపోయిన వస్తువులు

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

ఆగిరిపల్లి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): వట్టిగుడిపాడులోని దళితవాడలో సోమవారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో రేకుల షెడ్డు పూర్తిగా దగ్ధమైంది. బాధితుల కథనం ప్రకారం యలమర్తి సుగుణమ్మ, తన భర్తతో కలిసి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. కుటుంబ సభ్యులు ఇంటి బయట పనులు చేస్తుండగా షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించి ఇల్లు మొత్తం కాలిపోయింది. ఇంట్లోని సామగ్రి కాలిపోవడంతో నిరాశ్రయులయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ అధికారులు వచ్చి మంటలు అదుపుచేశారు. సుమారు ఐదు లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు.

సమగ్రంగా రీ సర్వే చేయాలి

ముసునూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): నిబంధనల ప్రకారం సమగ్రంగా రీ సర్వే ప్రక్రియ చేయాలని తహసీల్దార్ కె.రాజ్‌కుమార్ సిబ్బందిని ఆదేశించారు. కొర్లకుంట పంచాయతీ తాళ్ళవల్లిలో జరుగుతున్న రీ సర్వేను మంగళవారం ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. ఇప్పటివరకు గ్రామ సరిహద్దులు, బ్లాక్ సరిహద్దుల నిర్ధారణ పూర్తయిందని, పాయింట్స్‌కు రాళ్లు ఏర్పాటు చేశామన్నారు. మిగిలిన రీ సర్వేను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తిచేయాలని సిబ్బందికి సూచించారు. పూర్తయిన సర్వేకు సమగ్ర రికార్డును తయారు చేయాలని, రైతులు, ప్రజలు రీ సర్వేకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్వో మహేంద్రరావు, విలేజ్ సర్వేయర్ కె.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ సక్రమంగా పంపిణీ జరగాలి

ముసునూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): రేషన్ పంపిణీ సక్రమంగా జరగాలని, ఎటువంటి అవకతవకలకు పాల్పడినా చర్యలు తప్పవని తహసీల్దార్ కె.రాజ్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం కాట్రేనిపాడు, అక్కిరెడ్డిగూడెం గ్రామాల్లో ఉన్న రేషన్ దుకాణాలను ఆయన తనిఖీ చేసి, స్టాక్, రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వచ్చే నిత్యావసర సరుకులు పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు ప్రతి ఇంటికి వెళ్లి పంపిణీ చేయాలన్నారు. దుకాణాలకు వచ్చిన సరుకులు, పంపిణీ ప్రక్రి యలో రోజువారి రికార్డులు పక్కాగా ఉండాలన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	128, 137, 148
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475

'ఫిజియోథెరపీ'ని సద్వినియోగం చేసుకోవాలి

ముసునూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ జి.ప్రశాంతి అన్నారు. మంగళవారం రమణక్కపేట మెయిన్ పాఠశాలలో ఉన్న భవితసెంటర్‌లో ఉచిత ఫిజియోథెరపీ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పది మంది పిల్లలకు ఫిజియోథెరపిస్టు ప్రశాంతి చికిత్స అందించి, వారి పట్ల తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రభుత్వం దివ్యాంగ పిల్లల్లో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు ఉచిత చికిత్స, ఉపకరణాలను అందిస్తుందని ఎంఈవో బీవీఎస్ సుబ్బారావు తెలిపారు. కార్యక్రమంలో ఐఈఆర్పీలు డీఎంవీ లక్ష్మీనారాయణరావు, జె.నాగమల్లేశ్వరి, ఉపాధ్యాయులు లోకరాజు, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.



సారథి మెడలో పూలదండ వేస్తున్న సతీమణి లక్ష్మి

మంత్రి పార్థసారథి షష్టిపూర్తి

చాట్రాయి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): నూజివీడు ఎమ్మెల్యే, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, కమల లక్ష్మి దంపతుల షష్టిపూర్తి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. తమిళనాడులోని ప్రముఖ పుణ్యక్షేత్రం అలుమిరుగు అమృత కడేష్వర్ దేవస్థానంలో కుటుంబ సభ్యుల సమక్షంలో మంగళవారం జరిగింది. వారికి పలువురు రాష్ట్ర, నియోజకవర్గ కూటమి నాయకులు షష్టిపూర్తి శుభాకాంక్షలు తెలిపారు.

వేప చెట్టు నీడే ఆధారం..

చాట్రాయి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): అపరభద్రాద్రిగా పేరుగాంచిన చనుబండ సెంటర్‌లో, విజయవాడ-సత్తుపల్లి రహదారి పక్కన ఉన్న భారీ వేపవృక్షం వేసవిలో ప్రయాణికులకు నీడనిస్తూ ఉపశమనం కలిగిస్తుంది. మండుటెండలో ఈ రహదారి మీదుగా ప్రయాణించే వారు కొద్ది సేపు ఈ వేపవృక్షం కింద ఆగి వెళుతుంటారు. నిప్పులు చెరిగే ఎండ వడగాల్పుల సమయంలో ఈ చెట్టు కిందకు వెళితే చల్లగా ఉంటుంది. స్థానికులు మధ్యాహ్న సమయంలో ఈ చెట్టు కిందకు చేరి ఉపశమనం పొందుతూ ఉంటారు. అర ఎకరం స్థలంలో విస్తరించి ఉన్న ఈ వేపవృక్షం కింద శ్రీరమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయం, గ్రామ దేవత గుడి ఉన్నాయి. చెట్టు కింద పలువురు చిరు వ్యాపారులు పండ్ల దుకాణాలు, బడ్డీ కొట్లు, కూల్ డ్రింక్ షాపు, హోటల్ నడుపుకుంటూ జీవిస్తున్నారు. కొన్నితరాల నుంచి ప్రజలు జీవన స్రవంతిలో ఈ వేపవృక్షం భాగమైంది.



చనుబండలో వేప చెట్టు కింద ఏర్పాటు చేసిన దుకాణాలు